ప్రజాశక్తి

శుక్రవారం 9 డిసెంబరు 2022 | 8 పేజీలు | ఎన్‌టిఆర్ | కృష్ణా

కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ఎంప్లాయీస్ సొసైటీ నూతన పాలకవర్గం

బాధ్యతల స్వీకరణ

అభినందించిన సిపిఎం, సిపిఐ నేతలు : మేయర్‌ను కలిసిన పాలకవర్గం

ప్రజాశక్తి - విజయవాడ : మునిసిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ కో-ఆప్‌రేటివ్ సొసైటీ పాలకవర్గం ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన ప్రొగ్రెసివ్ ఫ్రంట్ ప్యానల్ సభ్యులను సిపిఎం, సిపిఐ, సిఐటియు, ఎఐటియుసి నాయకులు అభినందించారు. విజయం సాధించిన ప్రొగ్రెసివ్ ప్యానల్ సభ్యులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ అధ్యక్షులుగా జి అజయ్‌కుమార్, కార్యదర్శిగా టి బ్రహ్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా జి ఆంజనేయులు, సహాయ కార్యదర్శిగా మస్తాన్‌రావును సహ డైరెక్టర్లు ఎన్నుకున్నారు. వీరితో దుర్గాపురం కోఆప్‌రేటివ్ సొసైటీ కార్యాలయంలో ఎన్నికల అధికారి, రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఏసుదాసు ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ప్రత్యేక అభినందన, విజయోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్రకమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ నూతన పాలకవర్గాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సొసైటీ ద్వారా మరిన్ని మెరుగైన సేవలందించాలని కోరారు. సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోను పూర్తి స్థాయిలో అమలు చేయడానికి నూతన పాలకవర్గం కృషి చేయాలని కోరారు. సొసైటీ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయుల సమిష్టి కృషి ఫలితమే తమ విజయమన్నారు. అందరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపుతో (మిగతా 6లో)

నూతన పాలకవర్గాన్ని అభినందిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

ఎన్నికలకు

వైసిపి యాక్షన్ ప్లాన్

- లోపాలు అధిగమించడానికి దూకుడు మంత్రం
- పార్టీ శ్రేణులకు సిఎం దిశానిర్దేశం
- 50 కుటుంబాలు ఒక క్లస్టర్‌గా ఇద్దరు గ్రామ సారథులు
- కృష్ణాజిల్లాలో 19,720 మంది నియామకం!
- సచివాలయాల పరిధిలో 524 మంది కన్వీనర్లు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు ఏడాదిన్నర ముందే జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. గడపగడపకు ప్రభుత్వం పేరుతో అధికార వైసిపి ప్రజాప్రతినిధులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రానికి ఇదేం కర్మ పేరుతో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రతిపక్ష టిడిపి ప్రచారం చేస్తోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజల్లోకి చొచ్చుకెళ్ళేందుకు వైసిపి దూకుడు పెంచింది. అధినేత యాక్షన్‌ప్లాన్ ప్రకటించడం చర్చనీయాంశమైంది. గురువారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వైసిపి ప్రాంతీయ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జుల సమీక్షా సమావేశంలో ఆయన గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సన్నద్ధం చేశారు. ప్రజలకు, పార్టీకి మధ్య వారధులుగా ఉండేందుకు, వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజెప్పేందుకు గ్రామ సారథులను నియమించాలని పార్టీ నేతలను జగన్ ఆదేశించారు. క్లస్టర్‌కు ఇద్దరు గృహ సారథులను నియమించాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో 3 కన్వీనర్ల నియామకం చేపట్టాలన్నారు. ప్రతి 50 కుటుంబాలను ఒక క్లస్టర్‌గా గుర్తించాలని ఆదేశించారు. అయతే ఈ యాక్షన్ ప్లాన్ క్షేత్రస్థాయిలో ఎంతవరకు ఆచరణకు నోచుకుంటుందనే సందేహాలు అధికార పార్టీ నేతల్లోనే వ్యక్తం అవుతున్నాయి.

ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు కృష్ణాజిల్లాలో మొత్తం 408 సచివాలయాలకుగాను 1524 మంది కన్వీనర్లను, 50 గృహాలకు ఇద్దరు చొప్పున గృహ సారధులను నియమించాల్సి ఉంటుంది. 4.93 లక్షల గృహాలకు 19,720 మందిని గృహ సారధులుగా నియమించాలి. పార్టీ కార్యకర్తలకు క్షేత్రస్థాయిలో బాధ్యతలు అప్పగించి ప్రజల్లోకి పంపడం ద్వారా ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను అధిగమించి ప్రజలను పార్టీకి చేరువ చేసే వ్యూహం ఉందని వైసిపి వర్గాలు చెబుతున్నాయి.

పార్టీలో లుకలుకలు

వైసిపి అధినేత జగన్ పార్టీని ప్రజలకు చేరువ చేసేందుకు ప్రయత్నాలు చేస్తుంటే ఈ నియామకాలు పార్టీలో మరిన్ని కలహాలను రాజేస్తాయనే సందేహాలు నేతల్లో వ్యక్తం అవుతున్నాయి. పెడన నియోజకవర్గంలో మంత్రి జోగి రమేష్, కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక గ్రూపుల మధ్య పొసగడం లేదు. పామర్రు నియోజకవర్గ ఎంఎల్ఎ కైలే అనీల్ కుమార్, మాజీ ఎంఎల్ఎ డివై దాస్‌ల మధ్య అంతర్గత పోరు సాగుతోంది. ఈనేపథ్యంలో దాస్‌ను వైసిపి నుంచి బహిష్కరించారు. మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మధ్య విబేధాలు బహిర్గతమయ్యాయి. వచ్చే ఎన్నికల్లో ఆ ఇద్దరు నేతలు తమ కుమారులకు వైసిపి మచిలీపట్నం అసెంబ్లీ టికెట్ దక్కించుకునేందుకు చాపకింద నీరులా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అవనిగడ్డ నియోజవర్గంలోనూ నియోకవర్గ ప్రజాప్రతినిధికి, మండల స్థాయి నేతలకు మధ్య పొసగడం లేదు. గన్నవరం నియోజకవర్గంలోనూ ఎంఎల్ఎ వంశీ, గత ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలైన యార్లగడ్డ వెంకట్రావు, దుట్టా రామచంద్రరావు గ్రూపుల మధ్య విబేధాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా గృహ సారధులు, కన్వీనర్ల నియామకాల్లోనూ నియోజకవర్గాల్లోని వైసిపి గ్రూపుల మధ్య పోటీ పెరిగి మరిన్ని విబేధాలకు దారితీస్తాయేమోనన్న ఆందోళన నేతల్లో నెలకొంది.

కిడ్నీవ్యాధికి మరొకరు బలి

ప్రజాశక్తి - ఎ.కొండూరు : కృష్ణాజిల్లా ఎ.కొండూరు మండలం గొల్లమండల తండాకు చెందిన భూక్యా కొక్యా (61) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున తన ఇంటి వద్ద మరణించాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య తిరుపతమ్మ కథనం ప్రకారం...కొక్యా పదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల

కొంత కాలం వరకు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. ప్రస్తుతం విస్సన్నపేటలోని ఓ ప్రైవేటు వైద్యుని వద్ద వైద్యం చేయిస్తూ మందులు వాడుతున్నారు. రక్త పరీక్షలు చేసిన డాక్టర్లు క్రియాటిన్ 10.4 ఉన్నట్లు నిర్ధారించారు. డాక్టర్ల సలహా మేరకు మందులు వాడుతున్నారు. ఇప్పటివరకు (మిగతా 6లో)

ఆక్వాకు విద్యుత్ కష్టాలు

- రైతులకు విద్యుత్ రాయితీ పునరుద్ధరణ ఎప్పుడు ?
- సర్వేలు, సమాచార సేకరణ పేరుతో కాలయాపన
- 10 నెలలుగా విద్యుత్ భారం
- సాగుపై ప్రతికూల ప్రభావం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

'అర్హులైన సాగుదారులందరికీ విద్యుత్ రాయితీ పునరుద్ధరిస్తాం' అని ప్రభుత్వం చెప్పిన మాటలకూ, ఆచరణకూ పొంతన లేకుండా పోయింది. దీంతో రాయితీ వస్తుందని 10 నెలలుగా ఎదురు చూస్తున్న ఆక్వా సాగుదారులకు నిరాశే మిగులుతోంది. మార్కెట్ ఒడిదుడుకులతోపాటు పెరిగిన విద్యుత్ ఛార్జీలు ఆక్వా రైతులకు గోరుచుట్టుపై రోకటిపోటులా మారాయి. భారీగా వస్తున్న విద్యుత్ ఛార్జీలతో ఆక్వా సాగుకు వెనుకాడుతున్నారు. దీంతో ఈ సీజన్లో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోతోంది.

మచిలీపట్నం, నాగాయలంక, కోడూరు, కృత్తివెన్ను, బంటుమిల్లి, గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు, పెదపారుపూడి, పామర్రు, ఉంగుటూరు తదితర మండలాల్లో 88,240 ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. చెరువులకు, నిరంతరం నీరు తోడటానికి విద్యుత్ మోటర్లు వినియోగించాలి. రొయ్య, చేపల చెరువుల్లో ఆక్సిజన్ అందించేందుకు ఎరియేటర్లు ఉపయోగించాలి. డీజిల్ ధరలు ఆకాశాన్నింటడంతో విద్యుత్ యంత్రాలను ఉపయోగించి అత్యధిక విస్తీర్ణంలో సాగుచేస్తున్నారు. 8,240 విద్యుత్ సర్వీసులకు ఈ ఏడాది ఫిబ్రవరి వరకు రాయితీపై విద్యుత్ సరఫరా జరిగింది. యూనిట్‌కు రూ.1.50 పైసల చొప్పన ఛార్జీలు వసూలు చేశారు. అయితే మార్చి నుంచి రాయితీ విద్యుత్‌పై నిబంధనలు విధించారు. ఆక్వా జోన్లలో 10 ఎకరాల్లోపు విస్తీర్ణం ఉన్న రైతులకు మాత్రమే రాయితీ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో జిల్లాలో కేవలం 18 సర్వీసులకు మాత్రమే రాయితీ అందుతోంది. మిగిలిన 8,222 మంది ఆక్వా సాగుదారులు యూనిట్‌కు సగటున రూ. 3.85 చొప్పున చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఛార్జీలు రెట్టింపునకుపైగా వస్తున్నాయి.

సాగుపై ప్రభావం

కోడూరు మండలం పిట్టల్లంక గ్రామానికి చెందిన ఎస్.శివరామకృష్ణకు చెందిన ఏడెకరాల రొయ్యల చెరువునకు ఫిబ్రవరి వరకు విద్యుత్ రాయితీ లభించింది. యూనిట్‌కు రూ.2.06 చొప్పున (మిగతా 6లో)

పరిచయం లేనివారితో బాలికలు జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : నేటి సమాజంలో పరిచయం లేని వ్యక్తుల పట్ల బాలికలు జాగ్రత్తగా ఉండాలని చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ రజిని అన్నారు. గురువారం జగ్గయ్యపేట పట్టణంలో తొర్రగుంటపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మహిళల స్నేహపూర్వక సమావేశంలో రజిని మాట్లాడుతూ సమాజంలోని బాలికలు తోటి మగవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వారి నడవడిక ప్రవర్తనను గమనించి తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. బాలికలు అన్నింట లింగ వివక్షతకు గురవుతున్నారని నేటి సమాజంలో పురుషులతోపాటు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, బాలికలు లక్ష్యాలను కలిగి ఉండాలని వాటి ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కషి, పట్టుదల ద్వారా లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపులేటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, జి ఎం ఎస్ కె ఎస్కే పర్వీన్, ఏఎన్ఎం సునీత, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో దూకిన యువకుడు

- రక్షించిన ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వన్‌టౌన్ పరిధిలోని ప్రకాశం బ్యారేజీ, ఫిల్లర్ నంబర్ 61 వద్ద, విజయవాడ రూరల్ ప్రసాదంపాడు నివాసి గోపి గురువారం కష్ణానదిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంటనే సమాచారం అందుకున్న ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని రక్షించారు. అనంతరం బాధితుడిని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో పూర్తి సమాచారం తెలియాల్సి వుంది. పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

బైక్ చోరీ దొంగల అరెస్టు

ప్రజాశక్తి - గంపలగూడెం : ఆంధ్ర, తెలంగాణలో బైక్‌లు దొంగిలిస్తున్న దొంగలను గంపలగూడెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిరువూరు సిఐ గురువారం గంపలగూడెం పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ 8వ తేదీ అర్ధరాత్రి వెహికల్ చెకింగ్ లో భాగంగా పెనుగొల్ల గ్రామం మెట్టగుట్ట రహదారి వద్ద ఇద్దరు వ్యక్తులను అనుమానితులుగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిని విచారించగా మధిర, ఎర్రుపాలెం, గంపలగూడెం లో బైకులను చోరీ చేసినట్లు అంగీకరించినట్లు వివరించారు. గంపలగూడెం పరిధిలో ఆరు కేసులు, ఎర్రిపాలెం రెండు, కేసులు మధిర ఒక కేసు మొత్తం తొమ్మిది కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నారన్నారు. నిందితులను రిమాండ్ కు పంపుతున్నట్లు సీఐ భీమరాజు తెలిపారు.

నందిగామలో కారు దగ్ధం

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ పట్టణంలో గురువారం రాత్రి సిఎం రోడ్డు పక్క వీధి అపార్టమెంట్ లో గ్యాస్ లీక్ అయి కారు దగ్ధం అయింది. గ్యాస్ కారు లీక్ అవటంతో పెద్ద శబ్ధం వచ్చింది. పెనుప్రమాదం తప్పంది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఎవరూ లేరు. అగ్నిమాపక శాఖ అదికారులు వచ్చి మంటలను ఆర్పివేశారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

ప్రజాశక్తి-కంచికచర్ల : నిర్మాణం లో ఉన్న ఇంటిని ధ్వంసం చేసి, దాడి చేసిన నిందితులుపై కేసు నమోదు చేసి, న్యాయం చేయాలని బాధిత మహిళలు గురువారం రాత్రి కంచికచర్ల పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. బాధితల కథనం మేరకు మండలం లోని కీసర గ్రామానికి చెందిన రొంపిచర్ల లక్ష్మయ్యకు గతంలో నివేశన స్థలం కింద ప్రభుత్వం 5 సెంట్లు స్థలం కేటాయించింది. ఆయన తదనంతరం కుమార్తె మెండ్రు రాణి ఆ స్థలం లో పాత ఇంటి స్థానంలో నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టింది. ఇంటి నిర్మాణం జరుగుతుండగానే ఆ స్థలం పై అధికార పార్టీ నాయకుల కన్ను పడింది. దీన్ని కాజేయటం కోసం ఈ నెల 3 వ తేదీన గ్రామానికి చెందిన కట్టా కోటేశ్వరరావు, రాయప్ప, గారపాటి ఇంద్రయ్య, ప్రసాద్, వెంకయ్య, శౌరి తదితరులు ఒక్కసారిగా ఇంటిపైకి వచ్చి, దుర్భాషలాడుతూ, నిర్మాణం లో ఉన్న ఇంటిని ధ్వంసం చేశారు. అడ్డొచ్చిన మహిళల పై దాడి చేసినట్లు ఆరోపించారు. ఈ విషయం పై అదే రోజు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అయితే గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు, నిందితులపై కేసు నమోదు చేయకుండా పోలీసులపై ఒత్తిడి తేవటంతో, పోలీసులు ఫిర్యదును పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో గురువారం రాత్రి బంధువులతో కలిసి స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. మహిళలపై దాడి చేసినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పివియస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్

నేడు సమాజంలో మహిళలపై రోజు రోజుకూ పెరిగిపోతున్న అత్యాచారాలు, హత్యలు, హింసాయుత చర్యలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్-1 మూడవ సెక్టార్ ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న హింసను నిర్మూలించాలని గురువారం 47వ డివిజన్ కెఎల్ రావు నగర్‌లో గల రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగ పాల్గొని మాట్లాడుతూ నేడు మహిళల పట్ల చులకన భావం పెరిగిపోయిందన్నారు. మద్యం, మత్తు పానీయాలకు బానిసలైన యువకులు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, లైంగిక వేధింపులు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలు, మగపిల్లలు అనే వివక్ష తల్లిదండ్రులకు, సమాజానికి ఉండకూడదన్నారు. నేడు మగవారితో పాటు మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. మూడవ సెక్టార్ సూపర్‌వైజర్ అచ్యుతాంబ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చదువు మీద దృష్టి పెట్టాలన్నారు. ఏదైనా ఇబ్బందులు ఉంటే 1098 చైల్డ్ లైన్ నెంబర్ సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్‌కు చెందిన స్వరూపరాణి, అబ్రహ్మం, రాకేష్ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు షకీల, కల్పన, మల్లేశ్వరీ, 47వ డివిజన్ సచివాలయం ఎఎస్‌కెలు నాగదుర్గ, శ్రీవల్లి, పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దస్తావేజులు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని తిరుమలగిరి గ్రామంలో జంగాల కాలనీలో స్థల దాతల సహకారంతో 30 మంది జంగాల వాసులకు రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజులను గురువారం శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ తిరుమలగిరి గ్రామంలో జంగల కాలనీ నందు విజయవాడకు చెందిన నల్లపాటి శ్రీనివాసరావు, తుమ్మల శ్రీనివాసరావు, రామలింగమూర్తి గార్ల సౌజన్యంతో జంగాల వాసులకు రిజిస్ట్రేషన్ తో కూడిన దస్తవేజులను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్, తిరుమలగిరి నాయకులు జాగు జనార్ధన్, పోతురాజు వసంతరావు, చిల్లకల్లు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

దస్తావేజులతో లబ్ధిదారులు

పనులు పరిశీలిస్తున్న దృశ్యం

టిబి రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ పట్టణ అభివద్ధిలో భాగంగా సియం రోడ్డు 10,12 వార్డులలో అభివద్ధిలో భాగంగా రూ.37 లక్షల వ్యయంతో జరుగుతున్న బిటి రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ ఎస్. జయరాం గురువారం రాత్రి పరిశీలించారు. అంతేకాకుండా వార్డులో జరుగుచున్న అభివద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఫణి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-వత్సవాయి

వర్షాబావ ప్రభావంతో రైతులు పండించిన ధాన్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తహసీల్దార్ వైకుంఠరావు అన్నారు. రానున్న రెండు మూడు రోజుల్లో వర్షాభావ ప్రభావం ఉన్నందున రైతులందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ధాన్యం రాసులుగా పోసి ఉంటే అవి తడవకుండా పట్టాలు కప్పుకోవాలన్నారు. ధాన్యాన్ని అమ్ముకోవటానికి రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పోపూరి సంగీతరావుకు సతీ వియోగం

ప్రజాశక్తి-నందిగామ

సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోపూరి సంగీతరావు సతీమణి స్వరాజ్యలక్ష్మి (74) గురువారం తుది శ్వాస విడిచారు. ఆమె గత కొంత కాలంగా ఆనారోగ్యంతో బాధపడుతున్నారు. నందిగామ ఎంఎల్ఏ మొండితోక జగన్మోహనరావు, మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు, డూలాస్ ట్రస్టు చైర్మన్ పగిడిపల్లి దేవసహాయం, కాంగ్రెస్ నాయకులు పాలేటి సతీష్, కామా శ్రీనివాసరావు, గోపు నరేంద్ర, వజ్రయ్య పలువురు ప్రముఖులు స్వరాజ్యలక్ష్మి బౌతికకాయంకు నివాళులర్పించారు.

దుర్గమ్మను దర్శించుకున్న హీరో సాయి ధర్మతేజ్ తల్లిదండ్రులు

ప్రజాశక్తి - వన్‌టౌన్

శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మను జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సోదరి, హీరో సాయి ధర్మ తేజ్ తల్లిదండ్రులు విజయ దుర్గ శివ ప్రసాద్‌లు అమ్మవారి దర్శనార్థం గురువారం ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. దుర్గమ్మ దర్శనానికి విచ్చేసిన సందర్భంగా జనసేన నగర అధ్యక్షులు, రాష్ట్ర అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జ్ పోతిన వెంకట మహేష్ వారికి స్వాగతం పలికి అమ్మవారి దర్శనానికి తీసుకువెళ్ళారు.

మనోవిజ్ఞాన యాత్రపై సదస్సు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని కొత్తపేటలో గల పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో గల ఫ్రెష్‌మెన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గురువారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మనోవిజ్ఞాన యాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సెమినార్లో కెరీర్ కౌన్సిలర్, ప్రముఖ సైకాలజిస్ట్, సుధీర్ సంద్ర విద్యార్థుల నిర్దేశించి వారికి ఎటువంటి గడ్డు సమస్యలు ఎదురైనప్పటికీ వాటిని ఏ విధంగా మనోధైర్యంగా ఎదుర్కోవాలో, ఎటువంటి ఆలోచన విధానాన్ని పెంపొందించుకోవాలో, సంపూర్ణ మానసిక ఆరోగ్యంతో జీవితంలో ఎలా ముందుకు వెళ్లాలో వంటి విషయాలపై అవగాహన కల్పించారు. సక్సెస్ మాన్ రవికుమార్ సాగర్ మాట్లాడుతూ మనిషికి డబ్బు, పలుకుబడి, పెట్టుబడి వంటి వాటి అవసరం లేకపోయినా తెలివి తేటలు, సజనాత్మకత, టెక్నాలజీపై పట్టు వంటి నైపుణ్యాలతో జీవితంలో ఎలా ఉన్నత స్థాయికి వెళ్లగలగాలో తెలియజేశారు. ఇంటింటా ఇన్నోవేషన్ స్ఫూర్తితో సైకాలజిస్ట్ సుధీర్ సంద్ర నెల రోజులపాటు చేపట్టిన మనోవిజ్ఞాన యాత్రలో భాగంగా 22వ రోజుని విజయవాడలోని తమ ఇంజనీరింగ్ కాలేజీలోనే నిర్వహించడం విద్యార్థుల మానసిక ఆరోగ్యం పెంపొందించడంలో ఎంతగానో ఉపయోగపడిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జె. లక్ష్మీనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ పి. లక్షణస్వామి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. పతాంజలి శాస్త్రి, ఫ్రెష్ మెన్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -తిరువూరు : తిరువూరు నియోజకవర్గ రీజినల్ పా స్టర్స్ పెలోషి ప్ ఆధ్వర్యంలో స్థానిక అ మరావతి సూపర్ స్పెషాలిటీ ఆసుప త్రి సమీపంలో సెమీ క్రిస్టమస్ వేడుక లు తేళ్ళ పుష్పరాజ్ అధ్యక్షతన గురువారం ఘనంగా జరిగాయి. క్రిస్టమస్ అవశ్యకతను, యేసుక్రీస్తు గురించి ప లువురు పాస్టర్లు వివరించారు. ముఖ్య అతిదులుగా మాజీ ఎమ్మెల్యే నల్ల గట్ల స్వామిదాస్, జడ్పి మాజీ చైర్ పర్సన్ నల్లగట్ల సుధారాణి, నియోజక వర్గ పాస్టర్స్ పెలోషి ప్ అధ్యక్షులు బర్న బా ,రవీంద్ర డాని, జోనసన్ నాలుగు మండల పాస్టర్స్ అధ్యక్ష, కార్యదర్శు లు, నియోజకవర్గ పాస్టర్స్, భక్తులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే పూర్తిచేయాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌భాష

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

భూహక్కు-భూరక్ష పత్రాల పంపిణీ ప్రక్రియ, రీ సర్వే పనులను జిల్లాలో సమగ్ర కార్యాచరణ, సిబ్బంది సమిష్టి సమన్వయంతో వేగవంతం చేస్తున్నట్లు కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. భూహక్కు పత్రాల జారీ, జగనన్న శాశ్వత భూ హక్కుకు సంబంధించిన రీ సర్వే, వివాద స్థలాలపై చర్యలు, మ్యుటేషన్లపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం వివరాలను పి.రంజిత్‌భాష అధికారులకు వివరించారు. వారాల తరబడి వాయిదాలు వేయకుండా మిగిలిన రీసర్వే పనులను వచ్చే ఏడాది ఫిబ్రవరి లోపున ఫైయింగ్ పూర్తి చేయాలన్నారు. రీ సర్వే చేస్తున్నప్పుడు ఉత్పన్నమైన సమస్యలను అత్యంత ప్రణాళికా బద్ధంగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. ప్రజలను పూర్తిస్థాయిలో సంతృప్తి పరిచేలా, వారి భూ సమస్యలకు పూర్తిస్థాయి పరిష్కారాలు చూపేలా రీసర్వే ఉండాలన్నారు. రీ సర్వే అనంతరం కొలత రాళ్ళ పని పూర్తిచేయాలని సూచించారు. సమగ్ర సర్వే పూర్తయిన గ్రామాల్లో భూహక్కుదారులకు జగనన్న భూహక్కు- భూరక్ష పత్రాల జారీకి చర్యలు తీసుకోవాలని, మరో వారంలో 22వేల పత్రాలు జారీచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, భూసర్వే, రికార్డుల శాఖ సహాయ సంచాలకులు ఎస్.గోపాలరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వీధి లైట్ల ఏర్పాటు చేయాలి

జిల్లాలోని పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో వీధిలైట్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయం నుండి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ పాల్గొన్నారు. స్వామిత్వ, జగనన్న స్వచ్ఛ సంకల్పం, మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, ప్రాధాన్యత భవన నిర్మాణాలు వంటి అంశాలపై ఆయన కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఆయా అంశాలపై జిల్లా పురోగతిని ప్రిన్సిపల్ సెక్రటరీకి కలెక్టర్ వివరించారు. జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్, డ్వామా పిడి జి.వి. సూర్యనారాయణ, జడ్పి సిఇవో శ్రీనివాసరావు, ఎస్.ఈ పిఆర్ ఈరాస్వామి, ఆర్ డబ్ల్యుఎస్‌ఈ సత్యన్నారాయణ, డీఆర్డిఎ పిడి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని గంజాయి కేంద్రంగా మార్చారు: ముజాహిద్

గుడివాడ : ఒకప్పుడు దేశం మొత్తానికి బియ్యం ఎగుమతి చేస్తూ అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్ నేడు జగన్ రెడ్డి పాలనలో గంజాయికి నిలయంగా మారిందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ముజాహిద్ విమర్శించారు. యువతను డ్రగ్స్, గంజాయికు బానిసలుగా సిఎం జగన్ చేస్తున్నారని వివరించారు. ఏపీలో దొరికినంత గంజాయి దేశంలో మరే ఇతర రాష్ట్రంలో దొరకలేదని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) నివేదిక 2021 వెల్లడించిందన్నారు. 2021లో దేశవ్యాప్తంగా 7,49,761 కిలోల గంజాయి పట్టుబడితే అందులో 2,00,588 కిలోలు మన రాష్ట్రంలోనే పట్టుబడిందన్నారు. దేశంలో పట్టుబడ్డ గంజాయిలో సగం 50శాతం ఏపి. ఒర్సిసా రాష్ట్రాల్లోనే పట్టుబడిందన్నారు. దీనికి ముఖ్యమంత్రి సిగ్గుపడ్డాలన్నారు.

శాంతి భద్రతలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-పెడన

పెడన పట్టణ గ్రామదేవత శ్రీ పైడమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా గురువారం ఏర్పాట్లను బందర్ రూరల్ సీఐ వీరయ్య గౌడ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పెడన ఎస్సై రవిచంద్ర కుమార్, సిబ్బందికి జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

చేపల వేటకు వెళ్లొద్దు

ప్రజాశక్తి కోడూరు

మాండోజ్ తుఫాను నేపధ్యంలో కోడూరు మండల, వివిధ ప్రాంతాల నుంచి పాలకాయతిప్ప, హంసలదీవి సముద్రపు స్నానాల కోసం బీచ్ వద్దకు వచ్చే పర్యాటకులకు తుఫాను నేపథ్యంలో సముద్రం వద్దకు వెళ్లటానికి ఎలాంటి అనుమతులు లేవ కోడూరు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. మత్స్యకారులు వేటకు కూడా వెళ్లరాదని పేర్కొన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు బీచ్ ఎంట్రన్స్ గేట్లు మూసి వేశామని తెలిపారు. కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఏవైనా ఇబ్బందులు తలెత్తితే తక్షణమే పోలీస్, రెవెన్యూ శాఖ కాని సమాచారం ఇవ్వాలని కోరారు.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-ఉంగుటూరు:

మండల కార్యాలయంలో గురువారం ఎంపీపీ వి.సరోజినీ అధ్యక్షతన ఎంపీడీవో జివిస్వి శేషగిరిరావు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై రెండు రోజులు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామాల అభివృద్ధి కోసం పంచాయతీ స్థాయిలో అమలు పర్చాల్సిన ప్రణాళికలపై శిక్షణ ఇచ్చారు. 12 గ్రామాలు సర్పంచులు, ఎం.పి.టి.సిలు పాల్గొన్నారు.

'కాలం మారిన కథలు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో కాలం మారిన కథలు సినిమా పోస్టరును చైర్మన్ ఉప్పల హారిక గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ వాతావరణాన్ని తలపించే విధంగా సినిమా నిర్మాణం జరగటం అభినందనీయమని అన్నారు. పెడన నియోజకవర్గం కట్లపాలెం చెందిన దర్శకుడు సాగర్ పూర్తిగా గ్రామీణ వాతావరణంలో సినిమా తీశారన్నారు. సందేశంతో కూడిన సినిమా ప్రజలకి అవసరమన్నారు. మచిలీపట్నం సాహితి మిత్రులు అధ్యక్షులు, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ నేటి సమాజంలో దూరమైపోతున్న బంధాలను తెరకెక్కించిన ఘనత ఈ సినిమాకు దక్కిందన్నారు. భార్యాభర్తలు బంధం అంటే హృదయాలు పంచుకోవడం అనేది చాలా చక్కగా సినిమాలో చూపించారని బాలాజీ అన్నారు. తల్లిదండ్రుల పట్ల పిల్లలు బాధ్యతలు, స్నేహితుల మధ్య స్నేహం నమ్మకాలు ఎలా ఉండాలన్న విషయాన్ని తెరకెక్కించిన యువదర్శకుడు సాగర్ అభినందనీయుడని చెప్పారు. ఈ సందర్భంగా దర్శకుడు ఎంవివిఎస్ సాగర్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అతి తక్కువ బడ్జెటుతో యువ కళాకారులతో సినిమాను తీశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ, ఉప్పల రాము, సినీ హీరోయిన్ పల్లవి, హీరో రవితేజ, జాతీయ క్రీడాకారుడు ప్రభు తదితరులు పాల్గొన్నారు.

'చదువుకున్న పాఠశాలను మర్చిపోకూడదు'

ప్రజాశక్తి-గన్నవరం

పుట్టిన ఊరును.. చదువుకున్న పాఠశాలను ఎప్పటికీ మర్చిపోకూడదని జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి వెళ్లిన చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పైన

పాఠశాలను ప్రారంభిస్తున్న అజయ్‌కల్లాం

ఉందని సీఎం సలహాదారు అజేయయ్ కల్లం అన్నారు. గురువారం ఉంగుటూరు జిల్లా పరిషత్ హై స్కూల్లో నాడు-నేడు నిధులు రూ. రెండు కోట్ల రూపాయలు, పూర్వ విద్యార్థులు, ఎన్నార్లైలు సంయుక్తంగా రూ.మూడు కోట్ల సమీకరించి మొత్తం రూ.5 కోట్లతో అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసిన పాఠశాలను అజయ్‌కల్లాం, ఎమ్మెల్యే వంశీ, ఎన్నారై వెంకటాద్రిలు ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఏర్పాటు అయిన సభలో కల్లం మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా వెంకటాద్రి ఎంతో ఓర్పుతో తన సహచరులను కలిసి కోట్లది రూపాయలు సమీకరించి తాను చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయడం ఎంతోమందికి ఆదర్శనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా కోట్లది రూపాయలు వ్యయం చేసి పాఠశాలల రూపు రేఖలను మారుసోతందనానరు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీ మాట్లాడుతూ పాఠశాలలో మంచి సైన్స్ ల్యాబ్, ఇంగ్లీష్ రీడింగ్ రూమ్, డిజిటల్ ల్యాబ్, డైనింగ్ హాల్ ఏర్పాటుకు ఎన్నారై వెంకటాద్రి సంకల్పించడం అభినందనీయమని తెలిపారు. ఉంగుటూరు ఎంపీపీ వి.సరోజిని, సర్పంచ్ ప్రసాద్, ఏపీ ఎన్నార్టీఎస్ అధ్యక్షులు మేడపాటి వెంకట్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, వైసీపీ ఉంగుటూరు మండల అధ్యక్షులు శంకర్ రెడ్డి, ఎంపీడీవో శేషగిరిరావు పాఠశాల హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి ప్రాధాన్యత : చలసాని

గుడ్లవల్లేరు : కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఉత్పత్తి దారుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. గుడ్లవల్లేరు పాలశీతల కేంద్రంలో గురువారం బోనస్ చెక్కులను ఆయన పాల ఉత్పత్తిదారులకు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కృష్ణా మిల్క్ 2022-2003 సంవత్సరానికి గాను రెండో విడత బోనస్ గా రూ.89 లక్షలు పంపిణీ చేస్తోందన్నారు. 21-22 ఆర్థిక సంవత్సరంలో కృష్ణా మిల్క్ యూనియన్ రూ.1000 కోట్ల టర్నోవర్ అధికమించిందన్నారు. ఈ సంవత్సరం రూ.1200 కోట్ల టర్నోవర్ లక్ష్యం దిశగా అడుగులు వేస్తోందన్నారు. కళ్యాణమస్తు, ప్రతిభ వంటి పథకాలను ప్రవేశపెట్టినట్టు తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు, జిల్లా పాలకవర్గ సభ్యులు ఎ. వెంకట నగేష్, వల్లభనేని భాస్కర కుటుంబ వెంకట సుబ్బారావు, ఫీడ్ కమిటీ సభ్యులు ఎం వెంకటేశ్వర్రావు, జనరల్ మేనేజర్ జి అనిల్ కుమార్, పాలసీతల కేంద్రం మేనేజర్, తోట సత్యనారాయణ, ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ మేనేజర్ పీవీఎస్ లక్ష్మణ రావు, వివిధ పాల సంఘాల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

నాటుసారా తయారీపై సదస్సు

కోడూరు : జిల్లా ఎస్పీ జాషువా జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి ఎన్వి రామాంజనేయులు ఆదేశాలతో కోడూరు మండల పరిధిలోని వి.కొత్తపాలెం ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ జి.నూకరాజు ఆధ్వర్యంలో నాటు సారా తయారీ, విక్రయాలపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ నూకరాజు మాట్లాడారు. మత్తు పదార్థాల ప్రభావం పిల్లలపై పడి వారి జీవితాలు కూడా నాశనం అయ్యే అవకాశం ఉందన్నారు. వి.కొత్తపాలెం ఎంపీటీసీ సభ్యులు ముక్కు వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు రేపల్లె రాజయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి వి.ఏడుకొండలు, సచివాలయ కార్యదర్శి యలవర్తి తనూజ,మహిళా పోలీసులు గ్రామ వాలంటీర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదానం

బంటుమిల్లి : బంటుమిల్లి మండలం జానకిరాంపురంలోని శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవములు 11వ రోజు ముగిశాయి. అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. అర్జా సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. నాలుగువేల మందికి అన్న సమారాధన జరిగింది. గుడి ధర్మకర్త లేటు గంగిశెట్టి హనుమాన్ వారి కుమారుడు గంగిశెట్టి దేవానంద్ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది.

గూడూరు వైసిపి అధ్యక్షుడిగా రవికుమార్

గూడూరు : పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు గూడూరు మండలం గూడూరు గ్రామానికి చెందిన గొరిపర్తి రవికుమార్ ని గూడూరు మండల వై.యస్.ఆర్.సి.పి నూతన అధ్యక్షుడిగా నియమించినట్లు మంత్రి శ్రీ జోగి రమేష్ కార్యాలయం నుంచి వెలువడిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

టిడిపి ప్రచార కార్యక్రమం

ఉంగుటూరు : రాష్ట్రానికి ఇదేం ఖర్మ పేరుతో టిడిపి ఉంగుటూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ముక్కపాడు గ్రామంలో గురువారంనాడు వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం జరిగింది. టిడిపి నాయకులు ఆరుమళ్ళ వెంకట కృష్ణారెడ్డి, అళ్ళ హనోక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు తోటేటి. శ్రీనివాసరావు, గ్రామ ప్రధాన కార్యదర్శి చల్లగుళ్ళ. షణ్ముఖ, గ్రామ ఉపాధ్యక్షుడు రామిరెడ్డి. బాల

కరపత్రాలను పంపిణీచేస్తున్న టిడిపి నాయకులు

కృష్ణ,గ్రామ కార్య నిర్వాహక కార్యదర్శి మయూర. రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి పెట్టాలి : ఎంపిపి

గుడివాడ : గ్రామల అభివృద్ధి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుడివాడ ఎంపిపి గద్దే పుష్పరాణి అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికపై ఎంపిడీవో జి.వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ రూరల్ మండలంలోని 21 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లు

హనుమాన్ జంక్షన్ : మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించి ఎప్పటికప్పుడు నూతన బోధన పద్ధతులను అనుసరించడం అభినందనీయమని డెమొక్రటిక్ పి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షులు డి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక బాపులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మోడల్ పేపర్లను పుస్తకాలను ఆయన అందజేశారు. ఎంఇఒ సక్సేన రాజు మాట్లాడారు. హెచ్‌ఎం టి.వి నాగేశ్వరరావు, మండల శాఖ బాధ్యులు పి.రమేష్, కె.ప్రసాద్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్యూయలరీ షాపు ప్రారంభం

ప్రజాశక్తి-కంచికచర్ల : స్థానిక శివాలయం వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ గాయత్రీ జ్యూయలరీ షాపును పట్టణ వైసిపి అధ్యక్షుడు, గ్రామ ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు గురువారం ప్రారంభించారు. నూతనంగా జ్యూయలరీ వ్యాపార రంగంలోకి దిగిన షాపు నిర్వాహకులు కొఠారు దేవేంద్ర ను అభినందించారు. వినియోగదారుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వ్యాపారం దినదినాభివద్ధి చెందాలని వేమా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాస్, వంగా శ్రీనివాసరావు, కొఠారు పూర్ణ, మంగినేని ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆగిపోయిన కల్వర్ట్ పనులు పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-విజయవాడ : సింగ్‌నగర్ 61వ డివిజన్ శాంతినగర్ పరిధిలోని పోలమ్మ తల్లి గుడి దగ్గర విఎంసి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కల్వర్ట్‌ల పనులు తీవ్ర జాప్యం కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పనులను పూర్తి చేయాలని స్థానిక సిపిఎం నాయకులు చింతల శ్రీను కోరారు. ఈమేరకు డివిజన్‌లోని కల్వర్టులు, ఇతర పనుల తీరుపై మాట్లాడుతూ...స్థానిక డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు. బిల్లులు చెల్లింపులు జరగనందున సదరు కాంట్రాక్టర్లు చేయాల్సిన వివిధ వర్క్‌ను నిలుపుదల చేశారన్నారు. శాంతి నగర్ పోలమ్మతల్లి గుడి దగ్గర నగరపాలక సంస్థ నిధులతో డ్రైనేజిపై నిర్మిస్తున్న కల్వర్ట్ పనులు 45 రోజులకు పైగా పూర్తి చేయకుండా అలాగే పనులను నిలుపుదల చేశారని అన్నారు. దీంతో రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు కూడా గురికావాల్సి వస్తోందని అన్నారు. చెల్లించాల్సిన బిల్లులు ఇవ్వనందున పనులు చేయడం లేదని సదరు కాంట్రాక్టర్ వివరిసస్తున్నట్లు చింతల శ్రీను తెలిపారు. ఇప్పటికయినా ప్రమాదాల నివారణకు సత్వరమే కల్వర్టు పనులు పూర్తి చేయాలని, లేనట్లయితే స్థానిక నివాసులను కలుపుకొని ఉద్యమించాల్సి వస్తోందని అన్నారు.

నిలిచిపోయిన కల్వర్ట్

కొండచిలువ కలకలం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలం లోని తిరుమలగిరి గ్రామ సమీపంలో గురువారం భారీ కొండచిలువ గొర్రెల మందలోకి చొరబడింది. ఓ గొర్రెను పట్టి ప్రాణాలు తీసింది. దీంతో ఒక్కసారిగా గొర్రెల మంద పరుగులు తీయడంతో గొర్రెల కాపరి ఆళ్ళ తిరుపతిరావు తన వద్దనున్న ఆయుధంతో కొండచిలువను హతం చేశాడు.

ఐ ఫోనిక్ హబ్ ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ

యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధిపై ఎదగాలని నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్మోహనరావు పేర్కొన్నారు. నందిగామ పట్టణంలోని భారత్ టాకీస్ సెంటర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఐ ఫోనిక్ హబ్ మొబైల్ షాప్ ను నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్మోహనరావు ప్రారంభించారు. నిర్వాహకులు కరిముల్లాకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మారం అమరయ్య, స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మస్తాన్,జాఫర్ తదితరులు పాల్గొన్నారు .

నకిలీ మిర్చి విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-నందిగామ : నకిలీ మిర్చి విత్తనాలు వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం,కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో బాధిత రైతులు గురువారం నందిగామ పాతబస్టాండ్లో రైతు నేస్తం పాపు వద్ద ధర్నా చేశారు. అనంతరం పాతబస్టాండుకు వెళ్ళే రోడ్డుపై బైఠాయించారు. పాపు యజమాని నలజాల పూర్ణ పాపు మూసి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ పరారీలో ఉండటంపై రైతు నాయకులు బాదిత మిర్చి రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈసందర్భంగా కౌలు రైతు సంఘం ఎన్టిఆర్ జిల్లా అధ్యక్షులు సీతారెడి , రైతు సంఘం ఎన్టిఆర్ జిల్లా అధ్యక్షులు పివి ఆంజనేయులు, కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చనుమోలు సైదులు మాట్లాడుతూ గంపలగూడెం మండలం పెనుగొలును గ్రామ శివారు జింకలపాలెం తండా రైతులు సుమారు 50 మంది నందిగామ పాతబస్టాండు రైతునేస్థం షాపులో సుమారు 5 కేజిల వి గోల్డు 500 మిర్చి విత్తనాలు సుమారు పది లక్షల రూపాయల వ్యయంతో కొనుగోలు చేసి సాగు చేశారని తెలిపారు. ఎకరానికి 35 వేలు నుండి 50 వేల రూపాయల వరకు కౌలు, లక్షన్నర రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టపోవటం జరిగిందని తెలిపారు. పంట వేసి నాలుగు నెలలు అయినప్పటికీ మిర్చి పంట ఎదుగుదల లోపించటం, గిడసబారిపోవటం, పూత,పిందె రాక పోవటంతో పాపు యజమాని సంప్రదించిన ఫలితం లేకుండా పోయిందని, వ్యవసాయ అధికారులు, రెవెన్యూ,ఇతర ప్రభుత్వ అధికారులను కలిసిన పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వి షీల్డు గోల్డు 500 నకిలీ మిర్చి విత్తనాలు అమ్మిన రైతు నేస్తం పాపు యజమాని పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాదిత రైతులకు నష్ట పరిహారం యకరానికి 2 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయం చేసే వరకు ఆందోళన ఉదతం చేస్థామని హెచ్చరించారు.

ధర్నా నిర్వహిస్తున్న మిర్చి రైతులు

ఈకార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటరెడ్డి,కటారపు గోపాల్, గోపి నాయిక్, సయ్యద్ ఖాసిం, మిర్చి రైతులు షేక్ సైదా,జానీ, కరీమా, సత్తార్, ఖాసిం, భూక్యా గోపి నాయిక్ తదితరులు పాల్గొన్నారు. పోలీసులు సంఘటన ప్రదేశానికి వచ్చి పాపు యజమాని పై చర్యలు తీసుకుంటామని,రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో రైతులు ఆందోళన విరమించారు.

క్యాలెండర్ విడుదల చేస్తున్న దృశ్యం

అకడమిక్ క్యాలెండర్ విడుదల

ప్రజాశక్తి -తిరువూరు

మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అకడమిక్ క్యాలెండర్ ను విద్యా శాఖాధికారి బి.సోమశేఖర్ నా యక్ వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యా యులతో కలిసి గురువారం విడుదల చేశారు. దీనితోపాటు జగనన్న విద్యా కానుకలో భాగంగా 2023-24 విద్యా సంవత్సరానికి సంభందించి ముందస్తుగా బూట్ల కొలతలు తీసుకునే గ్రిడ్ పేపర్ ను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఆర్సీలు సిబ్బంది పాల్గొన్నారు.

తోపుడుబండ్లు అందజేత

ప్రజాశక్తి-విజయవాడ

సమాజంలో పేద, బడుగు బలహీన వర్గాల వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా మల్లాది వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆయన చేతుల మీదుగా ఏడుగురికి తోపుడు బండ్లను అందజేశారు. మల్లాది వేంకట సుబ్బారావు ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి కల్పించేందుకు తన వంతు కషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు కొండాయిగుంట మల్లీశ్వరి బలరాం, బంకా శకుంతల భాస్కర్, కొంగితల లక్ష్మీపతి, నాయకులు చినబాబు, బంకా బాబి, గుర్రం ఏడుకొండలు, బి.వసంత్ కుమార్, లోకేష్, కొండాయిగుంట రాము, కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని 3వ వార్డు పుట్ట బజార్ నందు పది లక్షల రూపాయలతో నిర్మించబోయే రోడ్డు నిర్మాణ పనులకు గురువారం శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణంలో తగిన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, స్థానిక వార్డు కౌన్సిలర్ అనురాధ కిషోర్, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ (బాజీ), ఎస్టి విభాగం అధ్యక్షులు బద్దు నాయక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

పట్టణంలోని విజయవాడ రోడ్డు వైఎస్ఆర్ విగ్రహం నుండి చిల్లకల్లు వరకు డబల్ రోడ్డు నిర్మాణ పనులను సామినేని ఉదయభాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలో రహదారుల అభివద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. దానిలో భాగంగా చిల్లకల్లు నుంచి జగ్గయ్యపేట వరకు 14 కోట్ల రూపాయలతో రహదారి అభివద్ధి పనులు ప్రారంభించామన్నారు.

ఈ కామర్స్ సేవలు సులభతరం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ : వినియోగదారులు సౌకర్యవం తమైన షాపింగ్ అనుభవాలను పొందేందుకు గాను ఈ కామర్స్ సేవలను విస్రృత పరచనున్నట్లు ఫ్లిప్‌కార్డు సంస్థ బిజినెస్ హెడ్ ఆదర్శ్ మీనన్ ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి చెందుతున్న హైపర్ వాల్యూ ఈకామర్స్, షాప్సీ బై ఫ్లిప్‌కార్డుపై ఎక్కువ మంది వినియోగదారులు సేవలు పొందేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే సేవలను సులభతరం చేసేందుకు ఈకామర్స్ ఆవిష్కరణలను తీసుకు వచ్చినట్లు తెలిపారు. తెలుగు, ఇంగ్లీషులో రీజనల్ భాషల ద్వారా వినియోగదారులకు సేవలను అందించేం దుకు తమ సంస్థ ముందుకు వచ్చినట్లు తెలిపారు.

మంచినీటి ట్యాంకర్ ప్రారంభం

ప్రజాశక్తి - గంపలగూడెం : మండల పరిధిలోని పెద్ద కొమెర గ్రామ పరిధిలో గల ప్రవాస భారతీయులు అనుమోలు సత్యనారాయణ, పాపినేని రామకష్ణ లు రెండున్నర లక్షలతో మొబైల్ మంచినీటి ట్యాంకర్‌ను బహుకరించగా విజయవాడ తెలుగుదేశం పార్టీ నాయకులు కేశినేని చిన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేముల కస్తూరి, ఎంపీటీసీ సభ్యులు దంతాల బుచ్చి రామయ్య, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రేగళ్ల వీరారెడ్డి, సీనియర్ నాయకులు చెరుకూరు రాజేశ్వరర దిరిశాల వెంకట కష్ణారావు, పిఎసిఎస్ అధ్యక్షుడు వేముల బాలయ్య , రాష్ట్ర సీసీఎల్ నాయకులు బూరుగు నారాయణ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విఎంసిలో ఏళ్ళ తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ సర్కిల్- 1 కమిటీ ఆధ్వర్యంలో గురువారం శానిటరీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి సత్యబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలు, కార్మిక హక్కులు హరించే నిర్ణయాలను అడ్డుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ఆదివారం పూర్తి శెలవు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఈ సమస్యల సాధన కోసం ఈనెల 15, 16 తేదీల్లో విజయవాడ వన్‌టౌన్‌లో జరిగే సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా 11వ మహాసభలను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపు నిచ్చారు. అలాగే 15వ తేదీ జరిగే ర్యాలీ, బహిరంగ సభలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పశ్చిమ నగర అధ్యక్షులు జి. వెంకట్రావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పశ్చిమ నగర అధ్యక్ష కార్యదర్శులు వై. ఏడుకొండలు, వి. సాంబులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు బోయి సత్యబాబు

విమానాలకు పక్షుల బెడద : ప్రయాణం భయం భయం

ప్రజాశక్తి-గన్నవరం

అంతర్జాతీయ విమానాశ్రయంగా గుర్తింపు పొందిన గన్నవరం ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు పక్షుల బెడద తప్పడం లేదు. విమానాశ్రయ పరిసరాల్లో జంతు కళేబరాలు, మాంసం వ్యర్థాలు, చెత్తా చెదారం డంప్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పక్షుల సంచారం విపరీతంగా పెరిగింది. ఫలితంగా విమానాల టేకాఫ్ , ల్యాండింగ్ సమయాల్లో తరచూ పక్షుల వల్ల తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. గతంలో ఇక్కడ పలుమార్లు విమానాలను పక్షులు ఢీకొన్న ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ సమయాల్లో విమానాలకు తృటిలో ప్రమాదాలు తప్పాయి. అయినా అధికారులు మాత్రం అప్రమత్తం కావడం లేదు. ఈ తరహా ఘటనలు జరిగినప్పుడు మాత్రం విమానాశ్రయ పరిసరాల్లో చెత్తడంపింగ్ చేయకూడదని సమావేశాలు నిర్వహించి హడావుడి చేస్తున్న అధికారులు అనంతర చర్యలను మాత్రం విస్మరిస్తున్నారు. పదేళ్ల వ్యవధిలో గన్నవరం విమానాశ్రయంలో ఏడుసార్లకు పైగా పక్షులు విమానాలను ఢీకొన్నాయి. తరచూ విమానాల ల్యాండింగ్, టేకాఫ్ సమయాల్లో పక్షుల వల్ల పైలెట్లు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పక్షులు ఢీకొనడం వల్ల ఎయిరిండియా, స్పైస్ జెట్, ఎయిర్ కోస్తా , జెట్ ఎయిర్‌వేస్‌కు చెందిన విమానాల సర్వీస్లు రద్దు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. పక్షులు ఢీకొన్నప్పుడు విమాన రెక్కలు ఇంజిన్ భాగాలు దెబ్బతిని సదరు విమాన సంస్థలకు రూ.కోట్లలో నష్టం కూడా వాటిల్లింది. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మాత్రం ఎయిర్ పోర్టు అధికారులు సమావేశాలు నిర్వహించి పక్షులు నివారణ క్రమంగా అరికట్టేందుకు ఆదేశాలు పక్షులను బెదిరించేందుకు బాణసంచా కాలుస్తున్న సిబ్బంది ఇస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పంచాయతీ, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో అనధికార డంపింగ్ యథావిధిగా కొనసాగుతోంది. ఫలితంగా విమానాలకు పక్షుల బెడద తప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ఎయిర్‌పోర్టు పరిసరాల్లో మాంసం వ్యర్థాలు, జంతు కళేబరాలు, చెత్తా చెదారం డంప్ చేయకుండా చర్యలు తీసుకోవాలని విమాన ప్రయాణికులు కోరుతున్నారు

కొరవడిన ఎయిర్‌పోర్టు సహకారం

విమానాశ్రయ పరిసర గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ఎయిర్‌పోర్టు సహకారం కొరవడింది. సామాజిక బాధ్యత పథకం కింద ఎయిర్ పోర్టు అథారిటీ గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు అవసరమైన సామగ్రిని అందించే వెసులుబాటు ఉంది. దీనికోసం ఏటా జరిగే పర్యావరణ సమావేశంలో ఎయిర్‌పోర్టు చుట్టూ ఉన్న బుద్ధవరం, కేసరపల్లి, అల్లాపురం, గన్నవరం గ్రామ పంచాయతీల నుంచి ప్రతిపాదనలు తీసుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో చెత్త నిర్వహణకు రిక్షాలు, డస్ట్‌బిన్లు, ఎస్సీ, బీసీ ఏరియాల్లో డ్రెయినేజీ నిర్మాణాలకు ఎయిర్‌పోర్టు అధికారులకు ప్రతిపాదనలు ఇస్తున్నప్పటికీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఆర్థిక సహకారం అందించలేదని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు ఎయిర్‌పోర్టు అథారిటీ గ్రామ పంచాయతీలకు తమ వంతు సహకారం అందించాలని కోరుతున్నారు .

మాంసం వ్యర్థాల డంపింగ్

విమానాశ్రయం చుట్టూ ఉన్న గ్రామాలు ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాలను డంపింగ్ యార్డు లుగా ఉపయోగిస్తున్నాయి. మాంసం దుకాణదారులు వ్యర్థాలను మూటలు కట్టి తీసుకొచ్చి విమానాశ్రయ రన్‌కు అతి సమీపంలో ఉన్న కొత్తపేట వద్ద పాటిగోతుల్లో పడేస్తున్నారు. దీనికితోడు జంతు కళేబరాలు, చెత్తాచెదారాన్ని యథేచ్ఛగా ఇక్కడ డంప్ చేస్తున్నారు. మాంసం కోసం వచ్చే గద్దలు పక్కనే ఉన్న విమానాశ్రయ రన్ వేపైకి చేరుతున్నాయి. రాజీవ్‌నగర్‌తోపాటు ఎయిర్‌పోర్టు తూర్పు వైపు ఉన్న వారు కూడా పక్షుల సంచారానికి కారణమైంది. రాజీవ్‌నగర్ కాలనీ, బుద్ధవరం వైపు విమానాశ్రయ పరిసరాల్లో పారిశుద్ధ్యం మరీ అధ్వానంగా ఉంది. దీనికితోడు విజయవాడ హోటళ్లలోని వ్యర్థాలను రాత్రి వేళల్లో ఆటోల్లో తీసుకొచ్చి కేసరపల్లి, ఎయిర్పోర్టు పరిసరాల్లో డంప్ చేస్తున్నారు. వీటివల్ల పక్షుల సంచారం పెరిగి విమానాల రాకపోకల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పక్షులను బెదరకొట్టేందుకు ఎయిర్‌పోర్టు సిబ్బంది బాణాసంచా ఉపయోగించాల్సిన పరిస్థితి నెలకొంది.

రాష్ట్ర ఫెన్సింగ్ చాంప్స్ ప్రత్యూష, ప్రీయూష సిస్టర్లు

ప్రజాశక్తి-గన్నవరం

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో గన్నవరం చైతన్య స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారిణులు డి.నాగ ప్రత్యూష, డి.నాగ ప్రీయూష సిస్టర్స్ తమ అమోఘప్రతిభ కనబరచి పతకాలు సాధించినట్లు శిక్షకులు, క్లబ్ ప్రధాన కార్యదర్శి ధనియాల నాగరాజు తెలిపారు. ఈనెల 5,6 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో నిర్వహించిన అండర్-14, 18 అంతర్ జిల్లా చాంపియన్ షిప్ పోటీల్లో ప్రత్యూష, ప్రీయుష గెలుపొందారు. గన్నవరం సెయింట్ జాన్స్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నాగ ప్రీయూష అండర్ 14 విభాగంలో బంగారు పతకాన్ని, టీం విభాగంలో కాంస్య పతకాన్ని చేజిక్కించుకుంది. విజయవాడ చైతన్య కాలేజ్‌లో ఇంటర్ చదువుతున్న నాగ ప్రత్యూష అండర్ 18 టీం విభాగంలో కాంస్య పతకాన్ని చేజిక్కించుకుంది. ఇంతటి ఘనవిజయం సాధించిన ఈ ఆణిముత్యాలకు ఇది తొలి అడుగేం కాదనీ ఇంతకుముందు కూడా రెండుసార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారని నాగరాజు తెలిపారు. ఈ అసమాన ప్రతిభావంతులు ఒకే ఇంటి నుండి రావటం చెప్పుకోదగ్గ విషయమైతే వారి తండ్రే వారికి ఫెన్సింగ్ శిక్షకుడు కావటం గొప్ప విశేషమని పేర్కొన్నారు. విజేతల తండ్రి, శిక్షకుడు ధనియాల నాగరాజును పలువురు కొనియాడారు. వీరిద్దరినీ కూడా ఫోగట్ సిస్టర్స్ సరసన నిలబెట్టాలన్నదే తన ఆశయమని తెలిపారు. అది తప్పక తన కుమార్తెలు నెరవేర్చుతారని ఆనందభాష్పాలతో నాగరాజు తెలిపారు.

ఉద్యోగావకాశాలను సాధించాలి : పటేల్

గుడివాడ : క్రీస్తు చూపించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించి, ఉన్నత విద్యతో ఉద్యోగ అవకాశాలను సాధించాలని స్మాల్ స్కేల్ ఇండస్ట్రియల్ రాష్ట్ర డైరెక్టర్ అప్పికట్ల

పటేల్ ఆకాంక్షించారు. గురువారం స్థానిక ఎన్‌జీవో హోంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన మాదిగ ఉద్యోగుల, బంధువుల ఆత్మీయ 13వ ఐక్య క్రిస్మస్ ఉత్సవ మిలాప్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత క్రిస్మస్ కేకును సభాధ్యక్షులు కె.జె విక్టర్‌పాల్ వ్యవహరించారు. స్మాల్ స్కేల్ ఇండస్ట్రియల్ డైరెక్టర్ అప్పికట్ల పటేల్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య, పచ్చిగళ్ళ దేవానందంలు క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దండు వీరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వపై ఎస్సీలు ఐక్యతతో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంపటి సైమన్, అత్తాటి సాల్మన్, పైడిముక్కల వంశీ, ప్రంశాత్, ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ ఉద్యోగులు, సంఘీయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం మండలం పెదపట్నం గ్రామ పంచాయతీకి చెందిన గోకవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఖాతాదారుడైన వీరవల్లి కృష్ణమూర్తి కొత్తూరు పెదపట్నం గ్రామంలో చనిపోయారు. గోకవరం పి. ఏ.సీ.ఎస్ ద్వారా కృష్ణాజిల్లా కోపరేటివ్ బ్యాంకు డైరెక్టర్, గోకవరం వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులు గడిదేసి పెద వెంకయ్య ఆధ్వర్యంలో గురువారం కృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో గోకవరం పిఎసిఎస్ సిబ్బంది, గ్రామస్తులు మీనవల్లి గోవింద్, శిలబోయిన మావుళ్ళయ్య, మల్లీరెడ్డి రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను కొనసాగించాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

కేంద్ర ప్రభుత్వం మైనార్టీలకు ఈ సంవత్సరం నుండి ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ రద్దు చేయటానికి నిరసనగా కౌతవరం ఉర్దూ అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ ఆధ్వర్యంలో గురువారం చెక్ పోస్ట్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం నాయకులు బి.వి.శ్రీనివాసరావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో మైనారిటీ విద్యార్థులైన ముస్లిం, క్రిస్టియన్,సిక్కు,జైన్,పార్శి తదితర 3 కోట్ల విద్యార్థులకు దరిదాపు రూ.9 వేల కోట్లు స్కాలర్ షిప్ లు ఈ సంవత్సరం నిలిపేయటం అన్యాయమన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ స్కూల్ కమిటీ అధ్యక్షులు యాదాల భాస్కర్, సెక్రటరీ కతీజా, వైస్ ప్రెసిడెంట్ టెంకాల పవన్, జాయింట్ సెక్రటరీ షాకీరా, మెంబెర్స్ ఎం.వంశీ, పవన్,జైబన్నీసా తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని జాగ్రత్త పర్చుకోవాలి

ప్రజాశక్తి-చల్లపల్లి

రాష్ట్రంలో తుఫాన్ హెచ్చరిక ఉన్నందున రైతుల తమ ధాన్యాన్ని జాగ్రత్త పంచుకోవాలని చల్లపల్లి మండల వ్యవసాయ అధికారిని జి.సాయి సింధు రైతులను హెచ్చరించారు. ఈనెల 9, 10 తేదీల్లో తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తాయని వ్యవసాయ శాఖ ప్రకటించిందని వివరించారు. పొలంలో వరి గాలికి పడిపోతే ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. కోసి ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించి భద్రపర్చుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమాచారం అందించాలని ఆమె రైతులకు సూచించారు

కన్నుల పండువగా శ్రీనివాస కళ్యాణం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

డోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి విశేష కళ్యాణం గురువారం నాడు కన్నుల పండువగా జరిగింది. మహాక్షేత్రం సప్తమ వార్షికోత్సవాల్లో భాగంగా ఏటేటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా విశేష కల్యాణాన్ని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పీ వీ కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు నిర్వహించారు. వారిరువురూ పీటల మీద కూర్చొని శ్రీనివాసుని కల్యాణాన్ని జరిపించారు. వేద పండితులు మంత్రోచ్ఛారణతో పాటు కళ్యాణం విశిష్టతను వివరించారు. శ్రీవేంకటేశ్వరుని కళ్యాణం నిర్వహణకు మహాక్షేత్రాన్ని రకరకాల పుష్పాలతో అలంకరించారు. శ్రీ వేంకటేశ్వరుని కళ్యాణానికి ముందు దేవతామూర్తులకు వేదపండితులు చక్రస్నానం జరిపించారు. బుధవారం ఉదయం నిత్య అర్చన, తోమాల సేవ అనంతరం ఉత్సవ మూర్తులను స్నపన మండపం వద్దకు తోడ్కొని వచ్చి పాలు, పెరుగు, తేనే, సుగంధ ద్రవ్యాలతో, అభిషేకం, చూర్ణ, గంధోత్సవం నిర్వహించి ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కోనేటిలో చక్రస్నానం జరిపించారు. చక్రస్నానం సందర్భంగా కోనేటిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. శ్రీవారు కోనేటిలో చక్రస్నానం ఆచరించిన తరువాత భక్తులు ఆ కోనేటిలో స్నానమాచరించిన, దర్శించినా, కోనేటి నీటిని చల్లుకున్నా వంద అశ్వమేధాల శక్తీ వస్తుందని వేదపండితులు తెలిపారు. ప్రతిరోజు స్వామి వారి పుష్కరిణిలో స్నానమాచరిస్తే నదీ పుష్కరాల సమయంలో పుణ్య స్నానం చేసినంత ఫలితం ఉంటుందని తెలిపారు. శ్రీ వారిచక్రస్నానం, కళ్యాణం లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పీ వీ కృష్ణారెడ్డి, సుధారెడ్డి, పీ వీ సుబ్బారెడ్డి, పీ వీరారెడ్డి, విజయలక్ష్మి, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ పీ. నాగిరెడ్డి, ప్రసన్న దంపతులు, వెంకటలక్ష్మి, కృష్ణవేణి వారి కుటుంబ సభ్యులు, యాత్రికులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి- కోడూరు

అవనిగడ్డ నియోజకవర్గంలోని నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ, మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాల్లో ప్రస్తుతం రైతులు పండించిన పంటను కొనుగోలు చేసేవారు లేక అనేక అవస్థలు పడుతున్నారని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఆవుల బసవయ్య, కోడూరు మండల అధ్యక్షులు జొన్నలగడ్డ రాజగోపాలరావు, రైతు సంఘం నాయకులు గరికపాటి కన్నారావు

ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్లే కాకుండా సహకార సంఘాలు సైతం పండించిన పంటను కొనుగోలు చేయకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం తుఫాను వాతావరణం నేపథ్యంలో ఏమి చేయాలో తెలియక దిక్కు తోచని పరిస్థితుల్లో రైతులు అల్లాడుతున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులు పండించిన పంటను తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు.

కార్యక్రమంలో బెంగళూరు క్రేన్స్ వర్సిటీ ప్రతినిధులు

ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ కోర్సులతో మంచి ఉద్యోగావకాశాలు

బెంగళూరు క్రేన్స్ వర్సిటీ ప్రతినిధుల వెల్లడి

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : విద్య, ఆర్థిక, డిజిటల్ మార్కెటింగ్ రంగాలతోపాటు శాస్త్ర, సాంకేతిక రంగాలలోనూ మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని బెంగళూరుకు చెందిన క్రేన్స్ యూనివర్శిటీ ప్రతినిధులు భువనేశ్వరి, భవానీ శంకరి తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నున్నలోని వికాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్రేన్స్ యూనివర్శిటీ సహకారంతో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రేన్స్ యూనివర్శిటీ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులకు మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ ఆధునాతన టెక్నాలజీ పాత్ర ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వికాస్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ నరెడ్ల సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమణ, వైస్ ప్రిన్సిపాల్ బివి రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతులు బి సురేష్, ఎం అశోక్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్ కిశోర్ బాబు పాల్గొన్నారు.

డ్రైన్ల నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : మండలంలోని నిడమానూరులో రూ.12 లక్షలతో డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. వీటి నిర్మాణ పనులను సర్పంచ్ శీలం రంగారావు, కార్యదర్శి ప్రకాష్ నాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ గ్రామం లో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులను చేస్తున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న కొమ్మినేని

పాత్రికేయులు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి

ప్రభుత్వ కమ్యూనికేషన్ సలహాదారు జి.వి.డి కృష్ణమోహన్

ప్రజాశక్తి - విజయవాడ : పాత్రికేయులు మానసిక ఒత్తిడిని తగ్గించుకుని ప్రశాంతమైన ఆలోచనలతో వార్తలను నివేదించడం ద్వారా వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని ప్రభుత్వ కమ్యూనికేషన్ సలహాదారు జి.వి.డి కృష్ణమోహన్ అన్నారు. సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో గురువారం జర్నలిస్టులకు మానసిక ఒత్తుడులు - పరిష్కార మార్గాలు అంశంపై ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ కమ్యూనికేషన్ సలహాదారు జి.వి.డి కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ పాత్రికేయులు కొంత సమయాన్ని యోగా, మెడిటేషన్, వ్యాయామంల పై దృష్టి కేంద్రీకరించవలసిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో ప్రెస్ అకాడమి కార్యదర్శి యం. బాలగంగాధర్ తిలక్, ఐజెయు ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు, ఏపిడబ్ల్యుజె ఉపాధ్యక్షులు కె. జయరాజ్, అర్బన్ అధ్యక్షులు చావా రవి, జర్నలిస్టు యూనియన్ నాయకులు ఎస్‌కె. బాబు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు, కార్యదర్శి ఆర్. వసంత్ పాల్గొన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పనే లక్ష్యం : ఎంఎల్ఎ వసంత

ప్రజాశక్తి - విజయవాడ : రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ప్రధాన లక్ష్యంతో గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం రాయనపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. రైతులు, అధికారులతో సమావేశమయ్యారు. రైతుల సందేహాలను నివత్తి చేశారు. రాయనపాడు నుంచి కొత్తూరు తాడేపల్లి వరకు బీటీ రహదారి అభివద్ధికి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు 7 ప్రాజెక్టులు ఎంపిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్రస్థాయి 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్-2022 పోటీలకు ఎన్టీఆర్ జిల్లా నుండి ఏడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక మండలి (ఏపిసిఒఎస్‌టి) ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఈ కార్యక్రమం నిర్వహించింది. జిల్లాస్థాయిలో 318 ప్రాజెక్టులు రిజిస్ట్రేషన్ జరగ్గా, వీటినుండి గత నెల 19న జరిగిన మండలస్థాయి కాంపిటీషన్లో 60 ఉత్తమ ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. జిల్లాస్థాయి ప్రాజెక్ట్ కాంపిటీషన్లో 7 అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేశారు. వీటిని ఈనెల 9వ తేదీన నుండి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని గూడూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శిస్తారు. ఈకార్యక్రమాన్ని విద్యాశాఖాధికారి సి.వి.రేణుక పర్యవేక్షణలో జిల్లా కో-ఆర్డినేటర్ మైనం హుస్సేన్ నిర్వహించారు. అనేక నెలలుగా విద్యార్థులు ఎన్టీఆర్ జిల్లాలో పరిశోధనలు చేసి తమ ఉత్తమ పరిశోధనలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని డిఇఒ రేణుక తెలిపారు.

భూ హక్కు పత్రాల పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భూ హక్కు పత్రాల పంపిణీ ప్రారంభించామని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు సిసిఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌కు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సర్వే అధికారులతో గురువారం సిసిఎల్ఏ ప్రధాన కార్యాలయం నుండి సిసిఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ భూముల రీసర్వే ప్రక్రియపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలోని 14 గ్రామాలలో భూముల రీసర్వే పనులు పూర్తి చేసి భూ హక్కు పత్రాల ముద్రణ, పంపిణీ ప్రారంభించామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్‌కుమార్, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసర్ కె. సూర్యారావు పాల్గొన్నారు.

PUBLIC NOTICE
IN THE COURT OF THE XVI ADDITIONAL DISTRICT JUDGE NTR DISTRICT, NANDIGAMA
(Under Guardian and Wards ACT, 1890)
G.W.O.P. NO. 60 OF 2022
(In the matter of permission to sell the petition schedule popperty of the minor Samineni Bhavishya and to purchase another property in favour of minor Samineni Bhavishna
Between :
Samineni Jyothsna
being minor rep. by mother ... Petitioner
And
Samineni Sudhakar .... Respondent.
Whereas the above named petitioner has instituted a petition under section 3,7 to 10 of Guardian and Wards Act, to declare the petitioner as guardian of her minor daughter i.e., Samineni Bhavishya and to grant permisssion to sell the property of minor A schedule and to purchase petition B schedule property in favour of minor Samineni Bhavishna etc., If any person having any objection inthe above matter, to appear before the Court on 28th Day of December, 2022 at 10-30 AM and to file your objections before the court.
Hearing Date : 28-12-2022
// By order of court//
Sri B.Venkataramaiah,
Advocate,
Jaggaiahpeta- 521175.

IN THE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATI
Tr.C.M.P. No. 272 of 2022
Between:
Smt. Rokkala (Myla) Sailaja,
W/o. Rokkala Sunil Kumar,
Occ: Housewife, R/o. Plot No. 201,
D.No. 65-6-571/5, Himachalnagar,
Gajuwaka, Visakhapatnam District.
.... Petitioner
AND
Rokkala Sunil Kumar, S/o. Prasada Rao,
R/o D.No. 18-11-26/7, Khuddas Nagar,
3rd Lane, Gandhi Nagar Post,
Vijayawada, Krishna District.
.... Respondent
To
Rokkala Sunil Kumar, S/o. Prasada Rao,
R/o D.No. 18-11-26/7, Khuddas Nagar,
3rd Lane, Gandhi Nagar Post,
Vijayawada, Krishna District□Respondent
NOTICE
Take notice that the above named Petitioner has filed the above Tr.C.M.P. No. 272 of 2022 before the Hon□ble High Court of Andhra Pradesh at Amaravathi. and as per the Orders Dt. 30-11-2022 of the Hon□ble High Court. you are hereby summoned to appear in the above case in person or by an advocate duly instructed relating to the above Tr.C.M.P. on 21-12-2022 at 10.30a.m. in default on the said day the Tr.C.M.P. will be decided inyour absence basing on the material available before the Hon□ble High Court.
M. KESAVA RAO
ADVOCATE
Flat No. 205, C-Block,
Prime Galaxy Apartments,
Dolasnagar, Tadepalli, Guntur District.
Mobile: 9440059169

మొదటి పేజీ తరువాయి

ఎంప్లాయీస్ సొసైటీ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.

నూతన సొసైటీ పాలకవర్గానికి మేయర్ అభినందన

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ప్రొగ్రెసివ్ ఫ్రంట్ నేతలను నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అభినందించారు. ఎన్నికల్లో విజయం సాధించిన సొసైటీ అధ్యక్షులు గుంజా అజయ్‌కుమార్, కార్యదర్శి తిరుమారెడ్డి బ్రహ్మారెడ్డి, ఉపాధ్యక్షులు గుర్రం ఆంజనేయులు, సహాయ కార్యదర్శి సింహాద్రి మస్తాన్‌రావు, డైరెక్టర్లు వేజెండ్ల ప్రభావతి, భూపతి గోవిందరావు, గుంటక ప్రభాకర్‌రెడ్డి, తోపుల శివశంకర్, బి రాజేష్, తాడిశెట్టి నాగరాజు గురువారం మర్యాదపూర్వకంగా మేయర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సొసైటీ ఎన్నికల్లో ఓటర్లకు ప్రొగ్రెసివ్ ఫ్రంట్ ప్యానెల్ విడుదల చేసిన మ్యానిఫెస్టోను అమలు చేసేందుకు సహాయ సహకారాలను అందించాలని మేయర్‌ను కోరారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సంక్షేమం కోసం తమ వంతుగా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. నగరపాలక సంస్థలోని ఆయా విభాగాల్లోని అధికారులను కూడా ప్యానెల్ నేతలు మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె శ్యామల, చీఫ్ ఇంజినీర్ ఎం ప్రభాకర్, డిసిఆర్ వెంకటలక్ష్మి, ఎ.ఒ కృష్ణమూర్తి తదితరులను కలిశారు.

ఆక్వాకు విద్యుత్ కష్టాలు

ఫిబ్రవరిలో రూ.25 వేల బిల్లు చెల్లించారు. అయితే మార్చి నుంచి బిల్లు పెరుగుతూ వచ్చింది. అక్టోబర్లో యూనిట్‌కు రూ.3.85 పైసల చొప్పన ఒక్క నెలలో రూ.75 వేల బిల్లు చెల్లించాల్సి వచ్చింది. ఎకరానికి రూ.10 వేలకుపైగా బిల్లు చెల్లించాల్సి వచ్చింది. మేత, సీడ్, కరెంటు ఛార్జీలు తదితర అన్ని ఖర్చులూ పెరిగిపోయాయి. ఆదాయాలు మాత్రం పడిపోవడంతో గిట్టుబాటు కావడంలేదు. దీంతో ఈ సీజన్లో రొయ్యల సాగును నిలిపివేశారు. ఇది ఈ ఒక్క రైతు సమస్య మాత్రమే కాదు. పిట్లలంకలో మొత్తం 700 ఎకరాల్లో ఆక్వా చెరువులకుగానూ 630 ఎకరాల్లో సాగు నిలిపివేశారు. 70 ఎకరాల్లో మాత్రమే తిరిగి సాగుచేస్తున్నారు. మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి, కమ్మరిపాలెం గ్రామాల్లో 200 ఎకరాలకు గానూ 30 ఎకరాల్లోనే సాగు చేస్తున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా ఆక్వా సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది.

సర్వే పూర్తికి మరో రెండు నెలలు

మత్స్యశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఎన్. శ్రీనివాసరావు

ఆక్వా సాగుపై సమాచారం సేకరిస్తున్నాం. వ్యవసాయ భూములను చెరువులుగా మార్చారా? ముంపు సమస్య ఉన్న భూముల్లో మాత్రమే చెరువులు తవ్వారా? ప్రభుత్వ భూముల్లో చెరువులున్నాయా? అన్న వివరాలను సేకరిస్తున్నాం. మత్స్యశాఖ, రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయశాఖలు సమన్వయంతో సర్వే చేయాలి. ఈ సర్వేను గ్రామ సభల్లో పెట్టి ఆమోదం తీసుకోవాలి. జిల్లాస్థాయి ఆచరణ కమిటీ ఆమోదం తర్వాత రాష్ట్ర స్థాయి కమిటీ ఆమోదానికి పంపుతాం. ఈ ప్రక్రియ పూర్తవ్వడానికి మరో రెండు నెలలు పడుతుంది. రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదం తర్వాత ఆక్వా జోన్లోకి వచ్చి 10 ఎకరాలలోపు విస్తీర్ణం కలిగి ఉన్న రైతుల విద్యుత్ కనెక్షన్లకు రాయితీ ఇస్తాం.

కిడ్నీవ్యాధికి మరొకరు బలి

వైద్యం నిమిత్తం రూ.8 లక్షలకుపైగానే ఖర్చు చేశారు. అయినా ఫలితంలేకపోవడంతో గురువారం మరణించాడు.తమను ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. మూడు రోజుల క్రితమై మండలంలోని కష్టారావు పాలెం గ్రామంలో కిడ్నీ వ్యాధితో దాసరి కష్టకుమారి అనే మహిళ మరణించిన సంగతి తెలిసిందే.

కొక్కా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : సర్పంచ్ రాముడు

కిడ్నీ వ్యాధితో మరణించిన భూక్యా కొక్కా కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ డి.రాముడు ప్రభుత్వాన్ని కోరారు. కొక్కా కుటుంబం అప్పుల ఊబిలో కూలికుపోయి ఉందని, ఆయనకు వైద్యం చేయించే నిమిత్తం కుటుంబ సభ్యులు అందిన చోటల్లా అప్పులు చేశారని తెలిపారు. నిరంతరం కిడ్నీ మరణాలు సంభవిస్తున్నా ప్రభుత్వంలో చలనం రావడం లేదని విమర్శించారు. కిడ్నీ వ్యాధితో మరణించిన ప్రతి ఒక్క కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం, ఎకరం వ్యవసాయ భూమి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రకటన
నా క్లయింటు కృష్ణాజిల్లా, గుడివాడ పట్టణ 11వ వార్డు దేవాస్ వాస్ గ్రాండియన్ అపార్టుమెంటు ప్లాట్ నెం. 601, ఇంటినెంబర్ 11/69, ఏలూరురోడ్డులోని పెద్దిబోయిన వెంకటేశ్వర వరప్రసాదు గారి భార్య నాగసుజాత గారి సంజాయిషీ పొంది తెలియజేయునది.
నా క్లయింటు మరియు నా క్లయింటు భర్తగారితో కలిసి ది. 5-12-2022 వ తేదీన ముదినేపల్లి మండలం పేరూరు గ్రామం నా క్లయింటు భర్తగారి స్వగ్రామమైనందున ఆ గ్రామములో నా క్లయింటుకు య.12-12 సెంట్లు చేపల చెరువు కలదు. సదరు చేపల చెరువు భూమికి సంబంధించిన దస్తావేజులు పరిశీలన నిమిత్తం వి.ఆర్.ఓ. గారి వద్దకు వెళ్లి చూపించ మరల తిరిగి ముదినేపల్లి వైపుకు వచ్చుచుండగా సదరు చేపల చెరువు దస్తావేజులతో పాటు పై అడ్రస్సుగల 253-6 చ॥గ॥ ఖాళీ స్థలము సంబంధించిన డాక్యుమెంట్లు కవరులో వున్నవి. కదరు చిరిగి ఈ దిగువ తెలిపిన డాక్యుమెంట్లు దారిలో జారిపోయినవి. కవరు చిరిగి కొన్ని డాక్యుమెంట్లు పోతున్నాయని ఎవరో చెప్పగా కవరును నా క్లయింటు చూసుకోగా మరలా దారిలో ముదినేపల్లి నుండి పేరూరు వరకు వెతికిననూ ఈ దిగువ తెలిపిన డాక్యుమెంట్లు దొరకలేదు.
1. డాక్యుమెంట్ నెం. 1807/2014 ది. 17-4-2014వ తేదీ 253-6 చ.గ. ఖాళీ నివేశన స్థలము.
2. డాక్యుమెంటు నెం. 5853/2016 ఏది : 14-10-2016 253 చ.గ. ఖాళీ నివేశన స్థలము.
3. డాక్యుమెంట్ నెం. 1314/2021 తేది : 16-4-20121 253.6 చ.గ. ఖాళీ నివేశన స్థలము నా క్లయింటు పేరున డాక్యుమెంటు.
5. డాక్యుమెంటు నెంబరు 6612/2021 తేది : 15-9-2021 253.6 చ.గ. ఖాళీ నివేశన స్థలము యొక్క సవరణ దస్తావేజులు.
కనుక పైన తెలిపిన నాలుగు డాక్యుమెంట్లు ఒరిజినల్ అయినందున ఎవరికైనా దొరికిన యెడల వెంటనే ఈ దిగువ తెలపిన అడ్రస్సుకు గానీ, పైన తెలిపిన నా క్లయింటు అడ్రస్సుకు గానీ తీసుకొని వచ్చి ఇవ్వగలరని యీ ప్రకటన ద్వారా మనవి చేయటమైనది.
గుడివాడ.
7-12-2022
పేటేటి ఈశ్వరరావు,
అడ్వకేట్.
సెల్ : **94415 18762**

బీచ్‌లో స్నానాలకు అనుమతి లేదు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మాండస్ తుపాన్ హెచ్చరికలు నేపథ్యంలో మంగినపూడి బీచ్ లో సముద్ర స్నానాలకు అనుమతులు లేవని బందరు తాలూకా ఎస్ఐ చాణిక్య తెలిపారు.మాండస్ తుఫాను నేపథ్యంలో జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు బందరు మండలం మంగినపూడి, పెదపట్నం బీచ్ ల వద్దకు పర్యాటకులు వెళ్ళేందుకు ఎటువంటి అనుమతులు లేవని, అలాగే మత్స్యకారులు వేటకు కూడా వెళ్లరాదని తెలిపారు.సముద్ర తీర గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా ఇబ్బందులు తలెత్తితే తక్షణమే పోలీస్ శాఖ కానీ రెవెన్యూ శాఖకు కానీ సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

పూ.జల్లో పాల్గొన్న గజ్జల శ్రీనివాసరెడ్డి

గుంటూరు జడ్‌పి సిఇఒ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-మోపిదేవి

మోపిదేవి శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని గురువారం ఉదయం గుంటూరు జిల్లా పరిషత్ సీఈఓ గజ్జల శ్రీనివాసరెడ్డి దర్శించుకున్నారు. ఆయన వెంట నిజాంపట్నం జెడ్పీటీసీ సభ్యులు ప్రసాదం వాసుదేవ, వైఎస్ఆర్సిపి నాయకులు కోసూరు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు శశాంక్ ఎంపిక

ప్రజాశక్తి-ఉయ్యూరు

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు అండర్ -14 విభాగంలో పెదఓగిరాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థి జె.శశాంక్ ఎంపికయ్యాడు. ఉమ్మడి కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అర్హత పోటీల్లో విశేష ప్రతిభ కనపరచి ఎంపికయ్యాడు. ఈసందర్భంగా పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శశాంక్, వ్యాయామ ఉపాధ్యాయిని వి.జ్యోతి లను ప్రధానోపాధ్యాయిని బి. సుధారాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.

హింసను అరికట్టాలి : ఐద్వా

ప్రజాశక్తి - గుడివాడ

మహిళలపై పెరుగుతున్న హింసను అరికట్టాలని ఐద్వా ఉపాధ్యక్షురాలు బసవ అరుణ అన్నారు. దేశవ్యాప్తంగా ఐద్వా ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచారంలో భాగంగా ఏ కె టి పి గర్ల్స్ హై స్కూల్ లో గురువారం సదస్సు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ సమస్య ఎదురైనప్పుడు పదిమందిని పిలిచి గట్టిగా అరవాలన్నారు. అలాగే పెప్పర్ స్ప్రే దగ్గర పెట్టుకోవాలని, కరాటే నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఈటి టి అనురాధ, ఉపాధ్యాయినులు,కె ఉమాదేవి, పి శివపావని, సాహితీ ప్రవంతి కన్వీనర్ ఎల్ సురేంద్ర, మహిళ సంగం సహాయ కార్యదర్శి షౌకతున్నిసా, 8,9 తరగతుల విద్యార్థినులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బసవ అరుణ

తపస్వి భౌతికకాయానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-పమిడిముక్కల

పమిడిముక్కల మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన పిన్నమనేని తపస్వి (21) సోమవారం హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆమె భౌతికకాయానికి గ్రామంలోని శ్మశానవాటికలో గురువారం కన్నీటి వీడ్కోలు మధ్య అంత్యక్రియలు జరిగాయి. గుంటూరులో 2011 ఆగస్టు 15న బిటెక్

తపస్వి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న వర్ల రామయ్య

విద్యార్థిని నల్లపు రమ్య (21) హత్య కేసు తరహాలోనే పెదకాకాని మండలం తక్కెళ్లపాడులో సోమవారం రాత్రి డెంటల్ విద్యార్థిని పిన్నమనేని తపస్వి దారుణ హత్యకు గురైంది. ప్రేమించానని నమ్మించటంతోపాటుగా నిరాకరించిందనే కక్షతో మన్నె జ్ఞానేశ్వర్ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. వివిధ రాజకీయపార్టీల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. టిడిపి జాతీయ నాయకుడు వర్ల రామయ్య, తెలుగు మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు నన్నపనేని రాజకుమారి, కృష్ణాజిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ, టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్ల కుమార్‌రాజా తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వర్ల రామయ్య మాట్లాడుతూ ప్రేమపేరుతో యువతలను నమ్మించటం, ఆ తర్వాత వంచించి మోయం చేయటం జరుగుతోందన్నారు. ఆ తర్వాత హత్యలు చేస్తుండటం దారుణమన్నారు. వైసిపి పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. తపస్వి హత్య అత్యంత దుర్మార్గమని నన్నపనేని రాజకుమారి, గద్దె అనురాధ పేర్కొన్నారు. నిందితుడికి మరణ శిక్ష విధించాలని డిమాండ్‌చేశారు. మాజీ ఎంపీపీ వెంకటసుబ్బయ్య, మైనేని ఇందిర, సిల్వి బాబు, వీఆర్‌పి వెంకటేశ్వరరావు, రామచంద్రరావు (రాము), వైసిపి నాయకుడు వీరంకి చిరంజీవి, దుర్గారావు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు బి.వేణుకుమారి మాట్లాడుతూ ప్రేమపేరుతో ఇన్‌స్టాగాం, ఫేస్‌బుక్‌ల ద్వారా పరిచయం అవుతున్న స్నేహాల పట్ల యువతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఘోర నేరాలకు పాల్పడుతున్న నిందితులకు కఠిన శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. తపస్వి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీలో అవినీతిపై విచారణ

పజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ మండల పరిషత్ టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీలో అవినీతి చోటుచేసుకుందని వచ్చిన ఫిర్యాదులపై జిల్లా కోపరేటివ్ సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రర్ కె లీల గురువారం రాత్రి సొసైటీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. టీచర్స్

రికార్డులను పరిశీలిస్తున్న అధికారిణి లీల

కోపరేటివ్ సొసైటీ పాలకవర్గం చేసిన అక్రమాలపై నిజ నిర్ధారణ చేసి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ ఈ ఏడాది మార్చి 27న సెప్టెంబర్ 9న యూటీఎఫ్ నాయకులు జిల్లా కోపరేటివ్ రిజిస్ట్రార్కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు విచారణకు వచ్చిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ లీల ఫిర్యాదు చేసినవారి నుండి వివరాలు తీసుకొని వాటికి సంబంధించిన పత్రాలను తీసుకున్నారు. విచారణకు వచ్చిన అసిస్టెంట్ రిజిస్ట్రర్ లీల విలేకరులతో మాట్లాడుతూ ఫిర్యాదుదారులు సమర్పించిన పత్రాల వివరాలను జిల్లా రిజిస్ట్రార్, ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు. యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు కె.జీవేంద్రరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు డి.నవజీవన్ మాట్లాడుతూ జిల్లా కోఆపరేటివ్ సొసైటీ పేరున సంతకాలు చేసి మండల పరిషత్ కోఆపరేటివ్ సొసైటీగా పేరు మార్చారని తెలిపారు. అడిగిన వారికి సభ్యత్వం ఇవ్వకుండా వారికి ఇష్టం వచ్చిన వారికి దొడ్డి దారిన ఇస్తున్నారని ఆరోపించారు. మొత్తం 10 అంశాలతో కూడిన వివరాల వినతి పత్రాన్ని అసిస్టెంట్ రిజిస్టర్ లీలకు సమర్పించినట్లు చెప్పారు. జమాఖర్చుల అంకెలు పెన్సిల్ తో రాసి వైట్నర్‌తో దిద్ది ఆమోదం అనంతరం అంకెలను మార్చివేసి అవకతవకలకు పాల్పడ్డారని చెప్పారు. పవిత్రమైన సొసైటీ హాలులో నాయకుల బంధువులతో పేకాట ఆడిస్తూ ఉపాధ్యాయ వృత్తికి కళంకం తీసుకువస్తున్నారని ఆరోపించారు.వీటన్నిటిపై సమగ్ర విచారణ చేసి అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అవనిగడ్డ, నాగాయలంక మండల శాఖ ప్రధాన కార్యదర్శులు ఎన్.శ్రీకాంత్, బి.సాంబశివరావు, అవనిగడ్డ కోశాధికారి బి.శివరామకృష్ణ, యుటిఎఫ్ నాయకులు టి.శ్రీను బాబు, ఎం.శ్రీనివాసరావు, ఎం.బాబి, సింహాద్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెంట్రప్రగడలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-పెదపారుపూడి

మండలంలోని వెంట్రప్రగడ శివారు పులవర్తి గూడెంలో కెనడా బాప్టిస్ట్ మిషన్ ఆధ్వర్యంలో పాస్టర్ రెవరెండ్ తిరువీధి పీటర్ అధ్యక్షతన గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్‌ఎస్ పాల్, సెక్రెటరీ డి.వి. రత్నం, ట్రెజరర్ డి.కాంతారావు, హైదరాబాద్ కు చెందిన బైబిల్ కాలేజీ ప్రొఫెసర్ నిర్మల్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని బైబిల్ ఆధారంగా క్రీస్తు జననంపై బోధించారు. అనంతరం కొవ్వొత్తులను వెలిగించి క్రిస్మస్ కేకును కట్ చేసి విశ్వాసులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు, పశ్చిమ, గుంటూరు, జిల్లాలతోపాటు కృష్ణా జిల్లా వాసులు పాల్గొని క్రిస్మస్ గీతాలు ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ ఆర్‌ఎస్ పాల్ సందేశం ఇచ్చారు.

క్రిస్మస్ వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు

వాలంటీర్ల సేవలు అమోఘం : సింహాద్రి

ప్రజాశక్తి-అవనిగడ్డ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో సచివాలయం వాలంటీర్లు విశేషమైన సేవలు అందిస్తున్నారని

మహిళలకు బుక్‌లెట్లు అందజేస్తున్న సింహాద్రి రమేష్‌బాబు

శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు కొనియాడారు. గురువారం అవనిగడ్డ 2 సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ, ప్రతి షాప్‌లకు తిరిగి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష, లంకమ్మ అమ్మవారి టెంపుల్ చైర్మన్ చింతలపూడి బాలు, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు గోళ్ళ కృష్ణకుమారి, మండల ట్రేడ్ యూనియన్ నాయకులు గార్లపాటి గోపి, గ్రామ ఉప సర్పంచ్ గాజుల జయ గోపాల్, గ్రామపంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా నాడు-నేడు పనులు : టిడిపి

అవనిగడ్డ : నాడు-నేడు పనులకు నిధులు మంజూరు చేయకపోవడంతో అవి అసంపూర్తిగా మిగిలిపోయి పాఠశాలలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టిడిపి నాయకులు విమర్శించారు. అవనిగడ్డ పంచాయతీనే వారు కొత్తపేట గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న నాడు-నేడు పనులను టిడిపి నాయకులు గురువారం పరిశీలించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ

స్కూలులో పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకుల బృందం

అధ్యక్షులు యాసం చిట్టిబాబు, మండలి ఉదయభాస్కర్, బర్మా శ్రీనివాసరావు,యలవర్తి చిన్న, కోనపురెడ్డి చంద్రశేఖర్, మాదివాడ రత్నారావు, రేపల్లె అంకినీడు, బచ్చు నాగేశ్వరరావు, బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి :** మండల పరిధిలోని వెంకటాపురం, పెద ప్రోలు, మోపిదేవి గ్రామాల పరిధిలో రైతులు తమ ధాన్యాన్ని రహదారుల వెంట ఆరబెట్టుకొని ఉండగా గురువారం సాయంత్రం వర్షపు చిరుచినుకులు రైతుల గుండెల పై తీవ్రభారం పడిదిక్కుతోచని స్థితిలో రైతుల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ టిడిపి నాయకులతో కలిసి మండల పరిధిలోని వెంకటాపురం, మోపిదేవి గ్రామాలలో ఆరబెట్టుకున్న ధాన్యాన్ని గురువారం పరిశీలించి రైతులకు ధైర్యం తెలిపారు. ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షులు జనార్ధన్ రావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కడవకొల్లు సీతారామాంజనేయులు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాస్ పుస్తకాలను అందజేస్తున్న ఆర్‌డిఓ

'భూరక్ష'తో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం : ఆర్‌డిఓ

ప్రజాశక్తి-ఏకొండూరు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ రక్షా పథకం వల్ల భూ సమస్య లకు శాశ్వత పరి ష్కారం లభిస్తుం దని తిరువూరు ఆర్డీవో వై వి ప్రసన్నలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని మారేపల్లి గ్రామంలో భూ రక్షా పథకంలో భాగంగా రీ సర్వే మారేపల్లి గ్రామంలో పూర్తికావడంతో ఆ గ్రామానికి చెందిన 195 మంది రైతులకు జగనన్న భూహక్కు పట్టాదారు పాస్ పుస్తకాలను ఆర్డిఓ చేతుల మీదగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కొందరు రైతులు రెవెన్యూ రికార్డులలో పేర్లు తప్పుగా నమోదు కావడం వలన రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సర్వే పథకం ద్వారా రైతులకు సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఆమె పేర్కొన్నారు. అన్ని గ్రామాలలో విడతల వారీగా రీ సర్వే కార్యక్రమం జరుగుతుందని అందరి రైతులకు కొత్తగా మంజూరయ్యే పట్టాదారు పాసు పుస్తకాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మారేపల్లి సర్పంచ్ నాగేశ్వరరావు ఏ కొండూరు ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి జెడ్పిటిసి సభ్యులు భూక్య గన్య గ్రామ ఎంపీటీసీ సభ్యులు శేషగిరిరావు, శ్రీనివాస్ దాసు ఏ. కొండూరు తహసిల్దార్ పాల్గొన్నారు

వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- గంపలగూడెం : మండలంలోని పెనుగొలను గ్రామంలో శివాలయం గేటు పక్కన శిరిడి సాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహా విష్కరణ వైభవంగా జరిగింది. వాల్మీకి సంఘ నాయకులు మీనుగు కష్ణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముందుగా వాల్మీకి చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి, గ్రామో త్సవం నిర్వహించారు. జగ్గయ్యపేట, తిరువూరులకు చెందిన 11 మంది వాల్మీకి సంఘ ప్రతి నిధులను స్థానిక సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు.

ఆంధ్రప్రదేశ్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో ఈ నెల 9 నుండి 13వ తేదీ వరకు జరుగనున్న 17వ జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ కు ఆంధ్రప్రదేశ్ జూనియర్ బాల బాలికల జట్లు పయనమయ్యాయని ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దారం నవీన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వల్లే శ్రీనుబాబు, కోశాధికారి అబ్దుల్ కరీమ్, ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ అజీజ్ జట్ల సభ్యులకు క్రీడా దుస్తులను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర జట్లకు ఎంపికైన సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి. బాలుర విభాగంలో ఎస్.ఆరోన్ రోనల్ డిన్ హెూ, ఆర్.కరణ్ కుమార్ రావాల్, వై.భాను ప్రకాష్ (అనంతపురం), పి.జీవన్ గౌతమ్, జి.బాల మనోజ్ కుమార్ (గుంటూరు), ఎమ్.సుధానవ్ రవి నందన్ (నెల్లూరు), ఎమ్.రేవంత్ (కష్ణా), నూరుల్ హుడా (కడప), బాలికల విభాగంలో పి.యుతిక, ఎమ్.భావన, పి.లావణ్య, జి.శ్వేతా, వై.వి.అక్షయ (కృష్ణా), ఎమ్.లిల్లి గ్రేస్ (గుంటూరు), ఎమ్.మోక్ష (కడప)లు ఎంపికయ్యారు.

పిల్లల అస్వస్థతపై సమగ్ర విచారణ

• నగర కమిషనర్‌కు డివైఎఫ్‌ఐ నేతల వినతి

ప్రజాశక్త-విజయవాడ, అర్బన్ : స్థానిక గాంధీ నగర్‌లోని సర్ విజ్జి నగరపాలక సంస్థ ఈత కొలనులో బుధవారం రాత్రి క్లోరిన్ మోతాదు ఎక్కువై పది మంది చిన్నారులు, అక్కడే పని చేస్తున్న మరో యువకుడు అస్వస్థతకు గురైన ఘటన పట్ల విచారణ జరిపించి, తగిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి కృష్ణ, ఎన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ గాంధీనగర్‌లోని మునిసిపల్ స్విమ్మింగ్ పూల్‌లో వస్తున్న స్విమ్మర్స్‌కు సరైన సదుపాయాలు కల్పించడంలో ఘోరంగా విఫలమయిందని అన్నారు. ఫీజులు వసూలు చేసే విషయంలో చూపిస్తున్న శ్రద్ధ , సదుపాయాల కల్పనలో ఎందుకు శ్రద్ధ పెట్టడం లేదని వారు ప్రశ్నించారు. స్మిమ్మింగ్ పూల్‌లో క్లోరిన్ గ్యాస్ ట్యాంక్ లీకేజి కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలుపుతున్నారని, అయితే 20 సంవత్సరాలుగా అదే క్లోరిన్ గ్యాస్ ట్యాంక్‌లను వాడుతుండటం సోచనీయమన్నారు. తుప్పు పట్టి, శిధిలావస్థకు చేరిన, పాతపడిన గ్యాస్ ట్యాంక్‌లు వాడటం వలన ఇప్పటికే పలు సార్లు ఈ గ్యాస్ లీక్ అవుతూ ప్రమాదాలు జరుగుతున్నట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. స్విమ్మింగ్ పూల్‌కు వస్తున్న స్విమ్మర్స్ నుంచి డిపాజిట్ రూపంలో రూ.1500, నెల వారీ ఫీజు రూపంలో మరో రూ. వెయ్యి నిర్వహకులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ...తప్పుని సరిగా ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తామని హామీనిచ్చారు. స్మిమ్మింగ్ పూల్‌లో సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీనిచ్చినట్లు డివైఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ కార్యదర్శి షక్ నిజాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్‌ఐ నాయకులు

చిన్నారులకు ఎంఎల్‌ఎ విష్ణు పరామర్శ

ప్రజాశక్తి-విజయవాడ : గాంధీనగర్ సర్ విజ్జీ స్విమ్మింగ్ పూల్ ఘటనలో అస్వస్థతకు గురైన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశించారు. పాత ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేదని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. అలాగే కొత్త ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జి అయిన చిన్నారుల గూర్చి వాకబు చేశారు. అత్యవసరమైతే ఏ సమయంలోనైనా తనను సంప్రదించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు.

చిన్నారులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గణితంపై పట్టు సాధిస్తే అద్భుత అవకాశాలు

గణిత అధ్యాపకులు ప్రఖ్యా సత్యనారాయణను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విద్యార్థులు గణితంపై పట్టు సాధించినప్పుడే అద్భుతమైన అవకాశాలను అందుకుం టారని ప్రముఖ గణితశాస్త్ర అధ్యాపకులు ప్రఖ్యా సత్యనా రాయణ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మాథమెటిక్స్ మోడల్స్‌పై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన ముగింపు సభలో ప్రఖ్యా సత్యనారాయణ మాట్లాడుతూ గణితంలోని వివిధ మోడల్స్‌ను తయారు చేయటం వలన వాటిపై మంచి అవగాహన పెరుగుతుం దన్నారు. గణితం పట్ల భయాలు ఉండకూడదని, దానిపై సాధన చేస్తే చక్కని ఫలితాలను పొందవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను బహుకరించారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు అధ్యక్షత వహించిన ఈకార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రామకృష్ణ, విభాగాధిపతి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చేందుకు మొబైల్ అన్న క్యాంటీన్ : టిడిపి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పేదల ఆకలి తీర్చేందుకే మొబైల్ అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసినట్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జిల్లాల ఇంఛార్జి బుద్దా వెంకన్న, తెలుగుదేశం పార్టీ బీసీ మైనార్టీ నాయకులు, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుర్ మీరా తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) సౌజన్యంతో, తెలుగుదేశం పార్టీ నాయకులు బుద్ధా వెంకన్న, కె. నాగుల్ మీరా ఆధ్వర్యంలో కేశినేని ఫౌండేషన్ వారిచే నడపబడుతున్న మొబైల్ అన్న క్యాంటీన్ 42వ రోజు గురువారం 52వ డివిజన్ నాలుగు పంపులు సెంటర్ వద్ద నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుర్ మీరా, జంపాల సీతారామయ్య, యువ నాయకులు కాండ్రేగుల రవీంద్ర, 52వ డివిజన్ కార్పరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) చేతుల మీదుగా మొబైల్ అన్న క్యాంటిన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గణప రాము, సోమీ వెంకటేశ్వర్లు, అమరుల్ల కను, ఈగల సాంబ, బాలకష్ణ, సతీష్, నూకరాజు, ఆన్సర్, ఖాన్, సాయి, పిళ్ళా వంశీ, లోకేష్, చెంచయ్య, గుణపర్తి జగదీష్, చిన్న కొండ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ అన్న క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు నాగుల్ మీరా తదితరులు

అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు చర్యలు : మేయర్

ప్రజాశక్తి-విజయవాడ : నగర వ్యాప్తంగా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం తూర్పు నియోజక వర్గంలోని 18 వ డివిజన్‌లో రూ. 208.09 లక్షల నగరపాలక సంస్థ సాధారణ నిధులతో (రాణీ గారి తోట) సిమెంట్ గౌడన్ పార్క్‌లో అభివృద్ధి పనులకు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించుటతో పాటుగా చిన్న పిల్లలను ఆకర్షించే పార్క్‌లను ఆధునీకరిస్తున్నామన్నారు. పార్టీలకతీతంగా అన్ని ప్రాంతాలు అభివద్ధి చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. వైసిపి తూర్పు నియోజకవర్గ ఇన్ ఛార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ గత మూడున్నర సంవత్సరాలుగా నియోజకవర్గ పరిధిలో అనేక అభివద్ధి పనులు చేపట్టి, వాటిని పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ 18 వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నా యన్నారు. సి.సి.రోడ్లు, కమ్యూనిటి హాల్ పెయింటింగ్స్, ఫ్లోరింగ్ , మిగిలిపోయిన వర్క్స్, భూగర్భ డ్రైనేజి, మంచి నీటి సరఫరా పైప్‌లైన్స్, సైడ్ లైటింగ్ వర్క్స్ , పచ్చ దనంతో పాటుగా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడమే లక్ష్యంగా పార్క్‌ను అభివద్ధి చేసి పున: ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమములో డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీ శైలజా , స్థానిక కార్పొరేటర్ , వైసిపి ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, జోనల్ కమిషనర్-3 డా. ఏ.రవిచంద్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్, పక్కన కమిషనర్, డిప్యూటీ మేయర్లు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.